RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 83 ISSUE NO : 83 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, సెప్టెంబర్, 16, 2025 Tuesday, September,16, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- కోటి రివార్డున్న టాప్ మావోయిస్టు నేత మృతి
- హజారీబాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి
- మృతుల్లో కోటి రూపాయల రివార్డున్న కీలక నేత సహదేవ్ సోరెన్
- రూ.25 లక్షలు, రూ.10 లక్షల రివార్డులున్న మరో ఇద్దరు కూడా హతం
- కోబ్రా, పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో స్వాధీనమైన మూడు ఏకే-47 రైఫిళ్లు
- రెండు రోజుల్లో రెండు ఎన్‌కౌంటర్లు.. కొనసాగుతున్న కూంబింగ్

ఝార్ఖండ్: ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. భద్రతా బలగాలు, పోలీసులు సంయు క్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు కీలక మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో కోటి రూపాయల రివార్డు ఉన్న అగ్ర నేత సహదేవ్ సోరెన్ అలియాస్ ప్రవేశ్ కూడా ఉండటం గమనార్హం. ఈ ఘటనతో మావో యిస్టు ఉద్యమం తీవ్రంగా దెబ్బతిన్నట్లయింది. హజారీబాగ్ జిల్లాలోని గిర్హోర్ పోలీస్ స్టేషన్ పరిధి లో ఉన్న పానితిరి అటవీ ప్రాంతంలో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. సహదేవ్ సోరెన్ నేతృత్వంలోని బృందం కదలికలపై పక్కా సమాచారం అందుకున్న కోబ్రా కమాండోలు, గిరిడి, హజారీబాగ్ జిల్లాల పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ క్రమంలో బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టులను మట్టుబెట్టినట్లు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) ధ్రువీకరించింది. మృతులను సెంట్రల్ కమిటీ సభ్యుడైన సహదేవ్ సోరెన్ (రివార్డు రూ. కోటి), స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు రఘునాథ్ హేంబ్రామ్ (రివార్డు రూ. 25 లక్షలు), జోనల్ కమిటీ సభ్యుడు వీర్సేన్ గంఝూ (రివార్డు రూ. 10 లక్షలు)గా గుర్తించారు. ఈ కాల్పుల్లో భద్రతా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.



## భారతీయుడి హత్య.. నిందితుడిని వదిలిపెట్టం

**అమెరికాలోని టెక్సాస్‌లో భారత జాతీయుడి దారుణ హత్య**

- క్యూబాకు చెందిన అక్రమ వలసదారుడి కిరాతకం
- ఘటనపై తీవ్రంగా స్పందించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- బైడెన్ ప్రభుత్వ వైఫల్యమే కారణమంటూ తీవ్ర విమర్శలు
- నిందితుడికి తీవ్రమైన నేర చరిత్ర ఉన్నట్టు వెల్లడి

వాషింగ్టన్: అమెరికాలోని టెక్సాస్‌లో భారత జాతీయుడు చంద్ర నాగమల్లయ్యను ఒక అక్రమ వలసదారుడు అత్యంత పాశవికంగా తల నరికి చంపిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, చట్టపరంగా అత్యున్నత స్థాయిలో విచారణ జరిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ హత్యకు బైడెన్ ప్రభుత్వ అసమర్థ పాలనే కారణమని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో స్పందిస్తూ, "డల్లాస్‌లో ఎంతో గౌరవనీయమైన వ్యక్తి చంద్ర నాగమల్లయ్యను, ఆయన భార్యాబిడ్డల కళ్లెదుటే క్యూబా నుంచి వచ్చిన ఒక అక్రమ వలసదారుడు అత్యంత కిరాతకంగా తల నరికి చంపిన భయంకరమైన వార్త నా దృష్టికి వచ్చింది.



## మరో మూడ్రోజులు భారీ వర్షాలు

### వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదా ద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్‌తో పాటు– పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామంలో 24.5 సెంటీ–మీటర్ల వర్షపాతం నమోదైంది.



## పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

- సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన
- ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు
- పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియో గించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించా లని మార్గనిర్దేశర చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాల ను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు. రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు–, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన

### సిఎం రేవంత్‌తో భట్టి, శ్రీదర్ బాబుల సమీక్ష

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** ఫీజు రియంబర్స్‌మెంట్‌పై కాలేజీ యాజమాన్యాల తీరుపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. కాలేజీల బంద్‌తో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఐటిశ్ఖాఖ మంత్రి శ్రీధర్ బాబులు సిఎం రేవంత్‌తో చర్చించారు. ఈ క్రమంలో తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కలిసి కీలకంగా చర్చించారు. ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్‌ను తిరిగి పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రిపోర్ట్‌లో అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని లాభాల కోసం వినియోగించు కున్నట్లు– స్పష్టంగా తేలినట్టు– తెలుస్తోంది.



## రేవంత్ ప్రభుత్వ నిర్వాకంతో 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు

**హైదరాబాద్,, తెలంగాణ దిశ:** రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి ఒక్కపైసా కూడా లేదని డిప్యూటీ సిఎం చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు.

**కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్**
**రేవంత్ పాలనలో హైదరాబాద్‌లో పెరిగిన క్రైమ్ రేట్**
**జూబ్లీహిల్స్ నుంచే కేసీఆర్ జైత్రయాత్ర మొదలవ్వాలి**
**జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్**

విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు, కమిషన్లు, కాంట్రాక్టులకు మాత్రం ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు..

## వారసులకే కమలంలో.. అవకాశాలు

**హైదరాబాద్, తెలంగాణ దిశ:** అందరివి నలుపు మరకలే. ప్రతి ఒక్కడూ ఆ తానులో ముక్కలే" వెనకటికి ఓ సినిమాలో బహుళ ప్రాచుర్యం పొందిన డైలాగ్ అది. అది నేటి రాజకీయాలకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కమలం పార్టీలో చోటు చేసుకున్న మార్పులకు అచ్చు గుద్దినట్టు సరిపో తుంది. ఉదయం లేస్తే కమలం పార్టీ నాయకులు ఇతర పార్టీ నాయకులను తిడుతుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని.. కుటుంబ సభ్యులకే పదవులు ఇస్తున్నారని మండిపడుతుంటారు. ఇన్నాళ్ళ వరకు బిజెపి ని ఈ విషయంలో కార్నర్ చేసే అవకాశం మిగతా పార్టీలకు లభించలేదు. అయితే ఇప్పుడు బీజేపీనే అవకాశాన్ని మిగతా పార్టీలకు దర్జాగా ఇచ్చేసింది. తెలంగాణలో అధికారంలోకి రావాలని.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బలమైన నిర్ణయంతో ఉంది బిజెపి. ఇప్పటికే గులాబీ పార్టీని మట్టి కరిపించామని.. త్వరలో కాంగ్రెస్ పార్టీని కూడా గద్దె దింపుతామని బిజెపి నాయకులు బలమైన నమ్మకంతో ఉన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బలంగా కోరుకుంటున్నారు. వారి కోరికలు నెరవేరుతాయా.. వారు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటారా.. అనే విషయాలను పక్కన పెడితే తెలంగాణ బిజెపిలో ఇటీవల కొంత మందికి పదవులు ఇచ్చారు. అవి పార్టీకి సంబంధించిన పదవులు.

# సేవాలాల్ తండా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాం







**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :**పేద ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి హయాంలో జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందనిషెడ్యూలు కులాల జాతీయ కమీషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం శామీర్ పేట్ మండలంలోని దేవరయంజాల్ లోని సేవాలాల్ తండా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపేందుకు కలెక్టర్ తో కలిసి హుస్సేన్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమీషన్ సభ్యులు మాట్లాడుతూ అధికారులు ఎందరో వస్తారు.. వెళతారు.. పేద ప్రజలకు మంచి చేసే అధికారులు చాలా కొంత మంది ఉంటారని అందులో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఒకరని అన్నారు. ప్రజలకు చేయగలిగినంత సేవ చేసినప్పుడే ప్రజలకు ఎల్లకాలం గుర్తుంటారని అన్నారు. దేవాదాయ భూములలో ఎన్నో ఎళ్లుగా గుడిసెలు వేసుకొని ఎన్నో సమస్యలను ఎదుర్కొంటు ఇక్కడే ఉంటున్న నిరుపేదలకు పట్టా భూములను అందించేందుకు అవసరమైన చర్యలతో పాటు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టరును కోరారు. ఎన్నో ఏళ్లు సేవాలాల్ తండా వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. వారికి ప్రధానమైన సమస్యలైన విద్యుత్తు, త్రాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలను తండాలో తిరిగి తెలుసుకున్నారు. ఒకే మీటరు పై దాదాపు తండా కుటుంబాలు కరెంట్ వాడుకోవడం ద్వారా నెలకు దాదాపు రూ. 3. 5 లక్షల కరెంట్ బిల్లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంతే కాకుండా త్రాగునీరు, రోడ్డు, స్మశానవాటిక, అంగన్ వాడీ స్కూల్, కమ్యూనిటి హాల్ వంటి మౌళిక వసతులు కల్పించాలని కమీషన్ సభ్యులు కలెక్టరును కోరారు. వీరి కనీస అవసరాలు తీరుస్తే వారి పిల్లల భవిష్యత్తు బాగుంటుందని, పిల్లలను తప్పకుండా చదివించాలని తండా వాసులకు సభ్యులు సూచించారు. ఈ క్రమంలో తమ వంతు కృషి ఎప్పుడు అందిస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ముఖ్యమైన సింగిల్ మీటర్ కరెంట్ సమస్యను అతి త్వరగా పరిష్కరించేందుకు విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశిస్తామని అన్నారు. అదే విధంగా డ్రైనేజీ, వీధి దీపాలు, త్రాగు నీటి సమస్యలను సంబంధిత శాఖలతో చర్చించి త్వరగా పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో పట్టా భూములకు సంబంధించి దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని కలెక్టర్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ అనిత, కీసర ఆర్డిఓ వెంకట ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట్ ఎంఆర్ఒ యాదగిరిరెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి పద్మజా, తూంకుంట మున్సిపల్ కమీషనర్ జ్యోతి, విద్యుత్తు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపురం కాలనీ రెవెన్యూ సంస్థలను పరిష్కరించాలి



మహాదేవపురం కాలనీ రెవెన్యూ సంస్థలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కాలనీవాసులు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు గత శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కు పంపించడం జరిగిందన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి వినతిపత్రాన్ని అందజేశారు.

(కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)

# నడిగడ్డ తాండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా: పిఏసి చైర్మన్ గాంధీ

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 (తెలంగాణ దిశ) :**శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నడిగడ్డ తండాలో నెలకొని ఉన్న అన్ని రకాల సమస్యలనూ పరిష్కరిస్తానని పిఏసి చైర్మన్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ హామీ ఇచ్చారు. నడిగడ్డ తండా సమస్యలపై అరికపూడి గాంధీ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. సమావేశంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, కస్టోడియన్ ఎనిమి ప్రాపర్టీ డిప్యూటీ సెక్రటరీ ముంబాయి, సెక్రటరీ అశోక్ కుమార్, సీఆర్పీఎఫ్ సెకండ్ కమాండెంట్ అమిత్ మిశ్రా, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామేశ్వరి దేవి, ఆర్డీవో వెంకట్ రెడ్డి, తహసీల్దార్ వెంకారెడ్డి, డీసీ శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నడిగడ్డ తాండా, సుభాష్ చంద్ర బోస్ నగర్, ఓంకార్ నగర్ కాలనీలలో నెలకొన్న సమస్యలు త్వరలోనే పరిష్కరానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నడిగడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్, ఓంకార్ నగర్ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, రోడ్లు డ్రైనేజీ, మంచి నీటి సరఫరా, బస్తి దవాఖాన, వీధి దీపాలు మొదలు మౌలిక వసతులు కల్పించామని, అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడలేదని, అన్ని విధాలుగా అండగా ఉన్నామని గాంధీ గుర్తుచేశారు. గతంలో సమస్య పరిష్కారానికి సీఆర్పీఎఫ్ ఐజీని పలు మార్లు కలిశాం అని, నడిగడ్డ తండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దు అని సూచించామన్నారు. వారం రోజులలో సమగ్ర నివేదిక అందిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అని, సమస్యల పరిష్కారంతో పాటు రక్షణ కల్పిస్తామని, తండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని, అన్ని విధాలుగా అండగా ఉంటామని తండా అభివృద్ధి బాధ్యత నాది అని చైర్మన్ గాంధీ హామీ ఇచ్చారు. తండా ప్రజలకు




సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు కలగజేయారాదని సూచించారు. ప్రజలను కాపాడుకుంటూనే స్థలాన్ని కాపాడాలని, సిబ్బంది తండ ఇండ్ల ముందుకు, ఇండ్ల లోకి వెళ్లి ఇబ్బందులు కలిగించారాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందరికీ ఇండ్లు నిర్మించుకునేవిధంగా సహాయ సహకారాలు అందిస్తామని, నడిగడ్డ తండా లో హాస్పిటల్, స్మశాన వాటిక నిర్మిస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, ప్రజలకు మరిన్ని మౌలిక వసతులు కల్పించి మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించెల అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చైర్మన్ గాంధీ తెలియచేసారు.



## సేవాలాల్ సేన జెండా ఆవిష్కరణ



సేవాలాల్ సేన పదవ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం ప్రగతి నగర్ లో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ వార్షికోత్సవం సందర్భంగా సేవాలాల్ సేన జాతీయ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల కేంద్రాలలో సేవాలాల్ సేన జెండాలను ఆవిష్కరించినట్లు తెలిపారు.

(కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన ఆకృతి నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :**బాచుపల్లి సర్వే నెంబర్ 454 ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అప్రోచ్ రోడ్డుగా చూపించి తప్పుడు అనుమతి పత్రాలను పొందిన నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట వాసులు జిల్లా అదనపుకలెక్టర్ ను కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఈ ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా వారు అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి విషయాన్ని వివరించారు. బాచుపల్లి లోని సర్వే నెంబర్ 454లో 400 గజాల స్థలాన్ని పక్కనే ఉన్న ఆకృతి కన్స్ట్రక్షన్స్ నిర్మాణ సంస్థ ఆక్రమించుకొని అప్రోచ్ రోడ్డు వేయడం జరిగిందని తెలిపారు. ఆ స్థలంలో రెవెన్యూ అధికారులు పాతిన ప్రభుత్వ స్థలం అనే బోర్డులను తొలగించి అదే స్థలం నుండి రోడ్డు వేశారని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో వేసిన రోడ్డును తొలగించి, రోడ్డు లేకుండానే తప్పుడు డాక్యుమెంట్లతో నిర్మాణ అనుమతి పత్రాలను పొందిన బాచుపల్లి ఆకృతి నిర్మాణ సంస్థ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. వచ్చిన ఫిర్యాదు పై అదనపు కలెక్టర్ స్థానిక తహసిల్దార్ కు తగు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారని ఫిర్యాదుదారులు తెలిపారు. అదనపు కలెక్టర్ ను కలిసిన వారిలో ఆకుల సతీష్, పలువురు బాచుపల్లి, నిజాంపేట వాసులు ఉన్నారు.

# జూబ్లీహిల్స్ అంబేద్కర్ నగర్ లో ఘనంగా మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం



**జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ)**సికింద్రాబాద్ జిల్లా జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని అంబేద్కర్ నగర్ లో అఖిల భారత మహిళా కాంగ్రెస్ 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత మహిళా కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు శానిటరీ నాప్కిన్స్, పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు సురక్షిత మంచినీటి కోసం భవిష్యత్తులో వాటర్ ఫిల్టర్ లను పంపిణీ చేస్తానని సునీతారావు హామీ ఇచ్చారు. మహిళా కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సునీతరావు మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కలాంబ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో రజియా సుల్తానా, రుద్రమదేవి, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ తదితరులు మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు



చేశారు. భారత మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణ త్యాగం చేసి మహిళా శక్తిని చాటారని అన్నారు. నేటి మహిళలు నారి శక్తిని స్ఫూర్తిగా తీసుకొని మహిళా శక్తి చాటాలని అన్నారు. మహిళలు శక్తి వంతంగా పనిచేయాలని సూచించారు. 1984 సెప్టెంబర్ 15 రోజున బెంగళూరులో మహిళా కాంగ్రెస్ జాతీయ మహాసభ జరిగిందన్నారు. ఈ సభను స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, అప్పటి నుండి సెప్టెంబర్ 15న మహిళా కాంగ్రెస్ ఒక ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి దేశ వ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయిలలో విస్తరించిందన్నారు. మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించడం ఎంతో గర్వకారణం అన్నారు. మహిళా సాధికారత రాష్ట్ర భవిష్యత్తుగా ప్రతి ఒక్క మహిళ



జీవితాలలో వెలుగులు నింపుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలుగా వ్యాపారంలో రాణించి తమ ప్రతిభతో రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తులో భాగస్వాములు కావాలని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ భాగస్వామ్యంతో మహిళా శక్తి పెట్రోల్ బంకులు, ఆర్టీసీ డ్రైవర్లుగా, ఓనర్లుగా మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయిస్తూ మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా మహిళ కాంగ్రెస్ ముందుండాలని సునీతా రావు సూచించారు. మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెయ్యి చీరల పంపిణీ కోసం టోకన్ల పంపిణీ



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :**బతుకమ్మ పండుగ సందర్భంగా 19న శుక్రవారం నిజాంపేట, రాజీవ్ గృహకల్పలో నల్లమల్లిస్ ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్ పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (రాధ) ఆధ్వర్యంలో వెయ్యి మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం కోసం టోకన్ల పంపిణీ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టోకన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, స్రవంతి, పి. శశికళ, శశికళ, రాధిక, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంపై సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తున్నాం

## - జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :** ప్రజారోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా అనారోగ్యానికి గురైన బాధితులందరికీ సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరీ చేస్తూ వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోందని గుర్తుచేశారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి ప్రజల సంక్షేమానికి కొనసాగిస్తూ తమ బాధ్యతగా, నేడు వైద్య అత్యవసర పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ 9.54 (తొమ్మిది లక్షల యాభై నాలుగు వేల) చెక్కులను అందజేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతతో, సంక్షోభ సమయంలో ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందనడానికి ఇదోక ఉదాహరణగా జగదీశ్వర్ గౌడ్ గుర్తుచేశారు. సమాజానికి సేవ చేయడానికి,



కష్టాల్లో ఉన్న వారికి తక్షణ సహాయం అందించేందుకు మేము ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ పక్షాన కట్టుబడి ఉంటామన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం వైద్య, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రూపొందించబడిందని, కష్టకాలంలో సమయానికి సహాయం అందించేలా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని అన్నారు. నల్లగండ్లలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

# నిజాంపేట్ లో అంబేద్కర్ భవన్ నిర్మించాలి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :**నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ భవన్ నిర్మించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమర్పించిన వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం మాట్లాడుతూ సుమారు లక్ష 50 వేల మంది దళితులు, ఎస్సీ ఉపకులాల వారు నివసిస్తున్నారని అన్నారు. వారి సంక్షేమం దృష్ట్యా అంబేద్కర్ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం నిమిత్తం ప్రభుత్వ భూములను దున్ను కోవడానికి పట్టాలు ఇచ్చిందని, వారికి భూ భారతిలో పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొంతిల్లు లేని దళితులకు ఇందిరమ్మ ఇల్లు లేదా డబల్ బెడ్ రూమ్



ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బక్క మల్లేష్, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్, ఆశి యాదయ్య, పొన్ని కంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సామ్రాజ్యవాదం..ఖనిజాలు

ప్రపంచంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం ప్రారంభం కావడానికి తెర తీసిన పారిశ్రామిక విప్లవం బ్రిటన్‌లో జౌళి మిల్లులలో మొదలైంది. ఐతే బ్రిటన్ కాని, యూరప్ ఖండం ఉత్తర భాగంలో ఉన్న తక్కిన దేశాలలో గాని ముడి పత్తి పండదు. అంటే, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం పుట్టుక నుండే ముడిసరుకులు ప్రపంచంలో ఎక్కడెక్కడ లభిస్తాయో వాటినల్లా సంపన్న దేశాలు చేజిక్కించుకోవడం మీద ఆధారపడి కొనసాగింది. ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా ఈ పరిస్థితిలో ఇసుమంతైనా మార్పు లేదు. కాలం గడుస్తున్న కొద్దీ సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఉత్పత్తి చేసే సరుకులు మారి కొత్త కొత్తవి వచ్చాయి. వాటికి కావలసిన ముడిసరుకులు కూడా మారుతూవచ్చాయి. ఈ ముడిసరుకులలో చాలా గణనీయమైన భాగం ఈ సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలి నుండే నిరంతరాయంగా సరఫరా ఔతున్నాయి. వాటి సరఫరా ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా కొనసాగడం అనేది సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు చాలా ముఖ్యం. ఆ విధంగా నిరాటంకంగా ముడిసరుకుల సరఫరా కొనసాగాలంటే బైట ప్రపంచం మీద సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యం కొనసాగించడం వాటికి అవసరం. ఈ విధంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలి ప్రపంచం నుండి ముడి సరుకు సరఫరా సాధారణ సరుకుల మారకం పద్ధతిలోనే జరుగుతుందని సాంప్రదాయ బూర్జువా అర్థశాస్త్ర పండితులు భావిస్తారు. ఇంకోలా చెప్పాలంటే, ఈ ముడిసరుకులన్నీ అప్పటికే సరుకులుగా ఉత్పత్తి ఔతున్నట్టు, అవి తగినంత పరిమాణాల్లో మార్కెట్‌లో లభిస్తున్నట్టు, మార్కెట్‌లో మామూలుగా ఉండే ధరల హెచ్చుతగ్గులకు తగ్గట్టు ఈ ముడిసరుకుల ధరలు కూడా నిర్ణయించబడుతున్నట్టు, అందుచేత వాటి మీద సామ్రాజ్యవాదం ఎటువంటి నియంత్రణనూ చెలాయించవలసిన అవసరం లేదన్నట్టు వారు భావిస్తారు. అంతేగాక అన్ని ముడిసరుకులూ అప్పటికే పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల పరిధిలోనే ఉత్పత్తి ఔతున్నట్టు వారు పరిగణిస్తారు. ఈ వాదన ద్వారా బూర్జువా ఆర్థికవేత్తలు అసలు సామ్రాజ్యవాదం అనేదే ఎక్కడా ఉనికిలో లేదని, ఉన్నదంతా సాధారణ బూర్జువా మార్కెట్ విధానమేనని చెప్పదలచుకున్నారు. వారు చెప్పేది చూస్తే ఇప్పటికే ప్రపంచం యావత్తూ పెట్టుబడిదారీ ప్రపంచంగా మారిపోయినట్టు, అంతా సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు అనుకోవాలి. అంతకన్నా విడ్డూరం వేరే ఏమీ లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థకి సామ్రాజ్యవాద లక్షణం అనేది లేనే లేదని చెప్పడానికి వారు మరొక వాదన కూడా ముందుకు తెస్తారు. సంపన్న పెట్టుబడిదారీ దేశాలు చేసే మొత్తం ఉత్పత్తిలో వారు ఉపయోగించే ముడిసరుకు మొత్తం విలువ చాలా తక్కువ శాతమే ఉంటుందని, అందుచేత అంత స్వల్ప విలువ కల ముడిసరుకు కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ ఏకంగా ప్రపంచం మొత్తాన్ని తన ఆధిపత్యం కిందకు తెచ్చుకునే పెద్ద ప్రయత్నాన్ని అసాధారణ రీతిలో ఎందుకు చేస్తుందని వారు అడుగుతారు. హారీ మెగ్‌డాఫ్ తన 'ఏజ్ ఆఫ్ ఇంపీరియలిజం' అన్న గ్రంథంలో ఈ వాదనకు సమాధానం ఇచ్చారు. ముడిసరుకులను ఉపయోగించకుండా ఏ సరుకునూ ఉత్పత్తి చేయడం జరగదని, అలా ఉపయోగించే ముడిసరుకు మారకపు విలువ ఎంత తక్కువ అయినా దాని ఉపయోగపు విలువ మాత్రం చాలా ఎక్కువని అతడు వివరించాడు. మారకపు విలువలు సామాజికంగా నిర్ణయించబడతాయి కనుక సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఆ ముడిసరుకుల విలువలను దాదాపు సున్నా స్థాయికి దిగ్గొస్తారని తెలిపాడు. ఐతే, ఆ ముడిసరుకుల వాస్తవ ఉపయోగం సహజంగా నిర్ణయించబడుతుంది కనుక అవి లేకుండా సరుకుల ఉత్పత్తి చేయడం అసాధ్యం ఔతుంది. ఆ కారణంగా వాటిని బైట నుండి ఎలాగైనా తెచ్చుకోవడం సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు తప్పనిసరి ఔతుంది. అందుచేత ముడిసరుకుల మారకపు విలువ చాలా స్వల్పం కనుక వాటిని పొందడం కోసం చేసే ప్రయత్నానికి పెద్ద ప్రాధాన్యత ఉండదన్న బూర్జువా పండితుల వాదనలు చాలా పొరపాటు. వ్యవసాయం ద్వారా లభించే ముడిసరుకులు, ఆహార పంటలు సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు ముఖ్యమైన అవసరాలు. వాటి కోసం అవి ప్రపంచం మొత్తంగా భూ వినియోగం తమ అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూసుకుంటాయి. ఆ భూ వినియోగం తీరుని వాళ్ళే అదుపు చేయడానికి ప్రయత్నిస్తారు. ఐతే ఇక్కడ ప్రధానంగా ఖనిజాల గురించి చర్చిస్తాను. సంపన్న దేశాలకు బైటనుండి ముడి ఖనిజాల దిగుమతి ఎంత కీలకమో ఇటీవల అమెరికా అరుదైన మూలకాల (రేర్ ఎర్త్స్) గురించి ఎంతగా ఆరాటపడుతోందో చూస్తే స్పష్టమౌతుంది.చైనా నుండి వచ్చే దిగుమతుల మీద సుంకాలనను పెంచుతామంటూ ట్రంప్ బెదిరిస్తే, దానికి జవాబుగా చైనా ప్రభుత్వం అమెరికాకు తన వద్ద నుండి కొన్ని అరుదైన మూలకాల ఎగుమతిపై తాత్కాలికంగా నిషేధం ప్రకటించింది. ప్రపంచంలో మొత్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన మూలకాలలో దాదాపు 70 శాతం చైనా నుండే జరుగుతున్నాయి. వాటిని ప్రాసెస్ చేసే సామర్థ్యం కూడా ప్రపంచం మొత్తం మీద 90 శాతం చైనా వద్దే ఉంది. చైనా ప్రకటించిన నిషేధంతో అమెరికా ఇరుకున పడింది. చైనాకు బదులుగా వేరే దేశాలనుండి ఆ అరుదైన మూలకాలను దిగుమతి చేసుకోడానికి ప్రయత్నించినా తక్కిన దేశాలేవీ చైనా నుండి వచ్చేంత ఎక్కువ పరిమాణంలో సరఫరా చేయగలిగిన శక్తి కలిగిలేవు. దాంతో అరుదైన మూలకాల సరఫరా అమెరికాకు కొనసాగించేలా చైనాను ఒప్పించడం కోసం తప్పనిసరి పరిస్థితిలో సుంకాల విషయంలో అమెరికా సంప్రదింపులకు దిగివచ్చింది. ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది. 2024లో అమెరికా దిగుమతి చేసుకున్న మొత్తం అరుదైన మూలకాల విలువ కేవలం 17 కోట్ల డాలర్లు. అదే ఏడాదిలో అమెరికా మొత్తం దిగుమతుల (వస్తువులు, సేవలు కలిపి) విలువ 4 లక్షల 11 వేల కోట్ల డాలర్లు! అందులో అరుదైన మూలకాలు కేవలం 0.004 శాతం మాత్రమే. ముడిసరుకుల ఉపయోగపు విలువకు, వాటి మారకపు విలువకు మధ్య ఉన్న తేడా ఎంత ఎక్కువో దీనిని బట్టి తెలుస్తుంది. మొత్తం దిగుమతుల్లో కేవలం 0.004 శాతం మాత్రమే ఉన్న అరుదైన మూలకాలు ఎలక్ట్రానిక్స్, వాహన తయారీ, విండ్ టర్బైన్లు, అత్యున్నత స్థాయి సామర్థ్యం కల అయస్కాంతాలు, వైద్య పరికరాలు వంటి పలు విలువైన ఉత్పత్తుల తయారీలో కీలకంగా ఉన్నాయి. అందుచేత వాటి సరఫరా తాత్కాలికంగానైనా నిలిచిపోతే అది సంపన్న దేశాలకు పెద్ద సంకటంగా మారుతుంది.అందుకనే సామ్రాజ్యవాదులు వాటి సరఫరాపై తమ పూర్తి నియంత్రణ సాధించడానికి ఎంతవరకైనా పోవడానికి తయారౌతారు. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించుకోవడం కోసం అమెరికా ఇతర వనరులను వెతుక్కుంటోంది. గ్రీన్‌ల్యాండ్ మీద తనకు ఆధిపత్యం కావాలని కోరుకుంటున్నది ఇందుకే. గ్రీన్‌ల్యాండ్ లో అరుదైన మూలకాలతోబాటు వివిధ రకాలైన ఇతర ఖనిజాలను కూడా పొందడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. చైనా తన సరఫరాను తాత్కాలికంగానైనా నిలిపివేయడంతో గ్రీన్‌ల్యాండ్ విషయంలో అమెరికా అంత ఆరాటాన్ని ప్రదర్శిస్తోంది. ఐతే ఈ ప్రత్యామ్నాయాలేవీ చైనానుండి వచ్చే సరఫరాతో సరితూగలేవు. ఎందుకంటే ప్రపంచ నిల్వల్లో సగానికి పైగానే అరుదైన మూలకాల నిల్వలు చైనా భూభాగంలో ఉన్నాయి. అమెరికా ఆరాటం అంతా వాటికోసమే. సామ్రాజ్యవాదం తక్కిన ప్రపంచం మీద ఆధిపత్యాన్ని చెలాయించడానికి ప్రయత్నించడం వెనుక మరొక కారణం కూడా ఉంది. రోజా లక్సెంబర్గ్ ఆ విషయాన్ని చక్కగా నొక్కి చెప్పారు. సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడి పోగుబడడం అనేది దీర్ఘ కాలం కొనసాగేలా జరగాలంటే అవి తమ దేశాలకు వెలుపల ఉన్న పెట్టుబడిదారీ–పూర్వ సమాజాల మార్కెట్లలోకి చొరబడడం చాలా అవసరం. పెట్టుబడిదారీ వ్యవస్థలున్న దేశాల్లో కూడా మార్కెట్లు ఉన్నాయి. వాటి మీద పెత్తనం కోసం కూడా సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ప్రయత్నిస్తాయి. ఐతే ప్రపంచీకరణ అమలౌతున్న ఈ కాలంలో మార్కెట్లు కూడా ప్రపంచీకరించబడ్డాయి. అందుచేత ప్రత్యేకంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఈ మార్కెట్ల మీద తమ ఆధిపత్యం కోసం ప్రయత్నం ఏదీ చేయనవసరం లేదు. ఎటొచ్చీ వాటికి అవసరమైన ముడి సరుకుల విషయంలో మాత్రం సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు మొత్తం ప్రపంచం మీద ఆధిపత్యం చెలాయించడం తప్ప వేరే మార్గం లేదు.

# విద్యా సంస్థలపై ట్రేడ్ లైసెన్స్ పేరుతో కొరడా

### - మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలకు ట్రేడ్ లైసెన్స్ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నరసింహ రెడ్డికి కుత్బుల్లాపూర్ మండల ప్రైవేట్ పాఠశాల యజమాన్యలతో కలిసి సురేష్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు ప్రైవేట్ పాఠశాలు, విద్యా సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ అవసరం లేదని 2022వ సంవత్సరం ఆర్డర్స్ కూడా ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల మధ్య తరగతి పాఠశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పాఠశాల యాజమాన్యాలు దివాళా తీసే స్థాయికి వస్తాయని అన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి అక్రమ చర్యలను, అక్రమ వసూళ్లను ఇక మీదట చేయవద్దని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇలా జరిగితే పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని చాలా వరకు ఇండ్లకు 100 శాతం పన్ను వేస్తున్నారని అన్నారు. దీంతో డివిజన్ పరిధిలోని పేద ప్రజలపై పన్నుల పేరుతో అధిక భారం వేయవద్దని కోరారు. ఈ మేరకు ఇందుకోసం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ మెయిన్ రోడ్డు నుంచి అన్నపూర్ణ ఈస్ట్ కాలనీకి త్వరలో అప్రోచ్ రోడ్డు

### - కాంగ్రెస్ గ్రేటర్ నేత నెమలి అనిల్ కుమార్




**మల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ లోని అన్నపూర్ణ ఈస్ట్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పర్యటించారు. కాలనీలో జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా అన్నపూర్ణ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నెమలి అనిల్ ను కలిసి చట్నీ బౌల్ హొటల్ పక్కన మెయిన్ రోడ్ నుండి స్ట్రీట్ నెంబర్ 6 మీదుగా తమ కాలనీకి అప్రోచ్ రోడ్డును మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో అతి త్వరలో అప్రోచ్ రోడ్డును అధికారులతో మాట్లాడి మంజూరు

చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మల్లాపూర్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ఎన్. చౌదరి, అన్నపూర్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కటర్ల శేఖర్ బాబు, భాను చందర్ రెడ్డి, ఎండి. నధీమ్, విలయత్ ఖాన్, లక్ష్మీపతి, ప్రదీప్, రఘు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 125 డివిజన్ దేవేందర్ నగర్ డబల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన పలువురు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంతరెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలనీ బిఆర్ఎస్ పార్టీ జగన్ నాథ్, పి. శ్రీనివాస్, ఎ. సత్యనారాయణ, ఎస్. ప్రసాద్, నాగరాజు, విజయ్. జిడి. ఆనంద్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆదే విధంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రతి తెల్ల కార్డు దారునికి సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ ద్వారా పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ చండీశ్వర్ నగర్ కాలనీ కమాన్ ప్రారంభం




నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చండీశ్వర్ నగర్ కాలనీ కమాన్ ను నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్, బిజెపి నాయకులు కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్, పాషా, శ్రీ చండీశ్వర్ నగర్ కాలనీ అధ్యక్షులు మెరుగు శ్రీనివాస్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– (నాగారం, తెలంగాణ దిశ)





# 430 కోట్లతో సిటీలో ఐకానిక్ బ్రిడ్జి

హైదరాబాద్, : తెలంగాణంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించి.. దాన్ని విశ్వనగరంగా నిలిపేందుకు ప్రణాళికలు రచిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందుకోసం వేల కోట్ల రూపాయల ఖర్చుతో అనేక ప్రాజెక్టులు ప్రారంభించింది. ఈ క్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసకుంది. భాగ్యనగరంలో మరో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు 430 కోట్ల రూపాయల ఖర్చుతో దీన్ని నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భాగ్యనగరంలోని చారిత్రక మీరాలం చెరువుపై.. రూ.430 కోట్లతో.. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపింది. మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో ఈ ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర పురపాలకశాఖ గురువారం అనుమతి మంజూరు చేసింది. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంఆర్‌డీసీఎల్ ఎండీ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలానే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, టెండరు ప్రక్రియను ఆలస్యం చేయకుండా.. వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఐకానిక్ బ్రిడ్జి నమూనాను.. ముందుగా ఐఐటీ హైదరాబాద్, జేఎన్‌టీయూ, వరంగల్ నిట్ వంటి ప్రముఖ సంస్థలు పరిశీలించి.. నిపుణుల ఆమోదం పొందాక.. నిర్మాణ పనులు ప్రారంభించాలని పురపాలకశాఖ తెలిపింది..ప్రభుత్వం మీరాలం చెరువుపై నిర్మించ తలపెట్టబోయే ఐకానిక్ బ్రిడ్జి పొడవు 2.5 కి.మీ ఉండనుంగా.. వెడల్పు 16.5 మీటర్లు ఉండనుంది. ఈ బ్రిడ్జిని.. చెరువుకు పశ్చిమాన ఉన్న చింతల్‌మెట్, తూర్పున శాస్త్రిపురం నుంచి సాగిపోయే బెంగళూరు నేషనల్ హైవేను కలిపేలా నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల చింతల్‌మెట్, శాస్త్రిపురం, అత్తాపూర్, కిషన్‌బాగ్, బహదూర్‌పుర ప్రాంతాల్లోని వాహనదారులకు.. అలానే చింతల్‌మెట్ నుంచి బెంగళూరు ఎన్‌హెచ్ ద్వారా ఎయిర్ పోర్ట్‌కి వెళ్లే వారికి ప్రయోజనం కలగనుంది. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.నిజాం కాలంలో ఈ చెరువును నిర్మించారు. భాగ్యనగర వాసుల దాహం తీర్చేందుకు మూడో నిజాం ఈ చెరువును నిర్మించారు. చెరువు నిర్మాణం పనులు జులై, 1804లో ప్రారంభం అయ్యి రెండేళ్ల వ్యవధిలో అనగా 1806లో పూర్తయ్యాయి. నిజాం సంస్థానంలో దివాన్‌గా పని చేసిన మీర్ ఆలం బహదూర్ పేరును ఈ చెరువుకు పెట్టారు. ఈ చెరువు కట్ట నిర్మాణం అర్ధ చంద్రాకారంలో ఉండి జనాలను విపరీతంగా ఆకట్టుకుంటుంది. చెరువు మధ్యలో మూడు దీవులుంటాయి. చెరువు నిర్మించినప్పుడు దీని విస్తీర్ణం 600 ఎకరాలు కాగా.. ప్రస్తుతం అది 450ఎకరాలకు పరిమితమైంది. ఈ చెరువు దిగువన జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఈ రెండింటిని ఐకానిక్ బ్రిడ్జితో అనుసంధానం చేసి.. పర్యాటకులను ఆకట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రైవేటు హాస్టల్స్ పై ఫోకస్..!

హైదరాబాద్:ప్రైవేట్ హాస్టళ్లలో పరిస్థితి, వాటిలో విద్యార్థులు, ముఖ్యంగా అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో ఎప్పటి నుంచో చర్చ నడుస్తోంది. అయితే కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన హాస్టళ్లలో విద్యార్థులు అత్యంత దయనీయమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు ప్రత్యక్షంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ వుమన్ అండ్ చైల్డ్ కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద తనిఖీలు చేయడం వల్ల బట్టబయలయ్యాయి.తమ పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే తపనతో లక్షల రుపాయాలు వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు చెందిన వారు సైతం కార్పొరేట్ విద్యా సంస్థలలో చేర్పిస్తు న్నారు. కాని అందుకు తగిన విధంగా విద్యార్థులకు వసతులు కల్పించే విషయంలో యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు కల్లారా చూస్తే తప్ప తెలియదు. ప్రధానంగా ఈ విద్యా సంస్థల వైపు అధికారులు కన్నెత్తి చూడరు. లోపల ఏం జరుగుతుందో బయటికి తెలియకుండా జాగ్రత్త పడతారు. అవసరమైతే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో వెనుకాడరనే విమర్శలున్నాయి. కనీసం తల్లిదండ్రులను కూడా లోపలికి అనుమతించకపోవడం. వారు ఏ పరిస్థితులో హాస్టళ్లో ఉంటున్నారు. ఎలా, ఏం తింటున్నారు.. అనే విషయాలపై బయటికి ఎవరు చెప్పినా, వారిని మానసిక వేధించడం, పనిష్మెంట్ కింద సస్పెండ్ చేయడం లాంటి దుర్మార్గపు పోకడలను అనుసరిసరిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ పరిశీలనలో బయటపడ్డాయి. కాని వారిపై చర్యలు తీసుకునే ధైర్యం గత ప్రభుత్వాలు చేయలేదు. ఈ ప్రభుత్వమైనా ఆ దిశలో అడుగులు వేయాలని కోరుకుంటున్నారు.అయితే ప్రైవేట్ హాస్టళ్లలో మాత్రమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ హాస్టళ్లను తనిఖీ చేయడం లేదని, అక్కడి పరిస్థితి, అక్కడ ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలనే ప్రశ్న ఉదయించడం సర్వసాధారణమే. కాని అందుకు ఆమె ధీటైన సమాధానం చెప్పారు. కేవలం ప్రైవేట్ సంస్థలు కాకుండా ప్రభుత్వ హాస్టళ్లు విజిట్ చేసిన సందర్భాలను గుర్తు చేస్తూ ఒక ఇంటర్వ్యూలో యాంకర్ అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు. అయితే వాటి పరిస్థితి లక్షలు పెట్టి చదివిస్తున్న హాస్టళ్లతో పోల్చడం సమంజసం కాదు. ప్రభుత్వ హాస్టళ్లలో పరిస్థితి అనుకున్న స్థాయిలో మెరుగ్గా లేకపోయినా, ప్రైవేట్ హాస్టళ్లలో పరిస్థితి మరీ దయనీయంగా కనిపిస్తోంది.కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద విషయానికి వస్తే, ఒక ఉన్నతాశయంతో జెడ్పీటీసీగా ఎన్నికై రాజకీయాల్లోకి వచ్చిన ఆమె కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా సేవలందిస్తు వస్తున్నారు. రాజకీయ ఉద్దండులు మాజీ మంత్రి ఎమ్మెస్సార్ శిష్యురాలిగా, దివంగత రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో మాట తప్పని, మడమ తిప్పని సిద్దాంతాన్ని పునికిపుచ్చుకున్ననేరెళ్ల శారద వేసే ప్రతి అడుగుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు బలమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ఆమె ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ముక్కుసూటిగా మాట్లాడే తత్వం, అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించడంతో పాటు సమస్యలను ఆకలింపు చేసుకొని వాటి పరిష్కారానికి ఎంతదూరమైన వెళ్లేందుకు వెనుకాడని మనస్తత్వం వుమన్ కమిషన్ చైర్ పర్సన్ పదవిలో రాణించేందుకు దోహదపడింది.ఏ సమస్యనైనా చెప్పుకోలేక, లోలోపల కుమిలిపోతూ బాధ అనుభవిస్తున్న విద్యార్థినుల సమస్యలను పట్టించుకోవడం, తామున్నామన్న భరోసా కల్పించే విషయంలో ఒక బలమైన అడుగు పడిందని భావించవచ్చు.

# కాంగ్రెస్ హయాంలోనే మహిళల అభ్యున్నతి

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు
- మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పండ్లు, బిస్కెట్లు, సానిటరీ నాప్కిన్లు పంపిణీ







**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :** కాంగ్రెస్ హయాంలోనే మహిళల అభ్యున్నతి సాధ్యమవుతుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మహిళా కాంగ్రెస్ 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాల్, ఉషోదయ కాలనీ అంగన్ వాడి స్కూల్‌లో పండ్లు, బిస్కెట్లు, సానిటరీ నాప్కిన్లు పంపిణీ చేశారు. మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ 41వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీతా రావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కలాంబ, ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అంగన్ వాడి విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీతా రావు మాట్లాడుతూ గతంలో రజియా సుల్తానా, రుద్రమదేవి, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ తదితరులు మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. భారత మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణ త్యాగం చేసి మహిళా శక్తిని చాటారని అన్నారు. నేటి మహిళలు నారి శక్తిని స్ఫూర్తిగా తీసుకొని మహిళా శక్తి చాటాలని అన్నారు.

మహిళలు శక్తి వంతంగా పనిచేయాలని సూచించారు. 1984 సెప్టెంబర్ 15 రోజున బెంగళూరులో మహిళా కాంగ్రెస్ జాతీయ మహాసభ జరిగిందన్నారు. ఈ సభను స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, అప్పటి నుండి సెప్టెంబర్ 15న మహిళా కాంగ్రెస్ ఒక ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి దేశ వ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయిలలో విస్తరించిందన్నారు. మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటామని తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించడం ఎంతో గర్వకారణం అన్నారు. మహిళా సాధికారత రాష్ట్ర భవిష్యత్తుగా ప్రతి ఒక్క మహిళ జీవితాలలో వెలుగులు నింపుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలుగా వ్యాపారంలో రాణించి తమ ప్రతిభతో రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తులో భాగస్వాములు కావాలని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ భాగస్వామ్యంతో మహిళా శక్తి పెట్రోల్ బంకులు, ఆర్టీసీ డ్రైవర్లుగా, ఓనర్లుగా మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయిస్తూ మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా మహిళ కాంగ్రెస్ ముందుండాలని సునీతా రావు సూచించారు. మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన మేడ్చల్ జిల్లాకు శానిటరీ న్యాప్కిన్ల తయారీ కేంద్రాన్ని మంజూరు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆదేశాల మేరకు జిల్లాలో ఘనంగా మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకురాళ్లు చింతల నిర్మలారెడ్డి, మెరుగు సునీత, జూపల్లి శోభారాణి, నరెడ్ల నీరజారెడ్డి, ఎస్ఎన్ కె. దుర్గ, అరుణ, నాగశిరోమణి, సంధ్య, కృష్ణవేణి, జాజాల అర్చన, ఫాతిమా, సుజాత, రమాదేవి, నారాయణమ్మ, కల్పన, భారతమ్మ, విజయలక్ష్మి, జ్యోతి, కల్పన, కమల లక్ష్మీ, సంగీత, ప్రసన్న, రేణుకారెడ్డి, మాధవి, మణి, అశ్వినీ, తులసి, భారతమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చక్రిపురంలో.. దుర్గంధం... దుర్వాసన..,





చర్లపల్లి డివిజన్ చక్రిపురం కాలనీలోని ఖాళీ ప్రదేశంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన దుర్గంధం వెదజల్లుతుంది. గత కొన్ని రోజులుగా మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించక పోవడంతో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనికి తోడు వర్షం నీరు నిల్వ ఉ ఒడడంతో దోమలు, ఈగలు రాజ్యమేలుతున్నాయి. చుట్టుపక్కల నివాసాలలో ఉండలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం అవార్డులు తీసుకుంటూ ఎక్కడ చెత్త అక్కడే వదిలేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- (కుషాయిగూడ, తెలంగాణ దిశ)

## ఆలేరులో ఘనంగా మహిళా కాంగ్రెస్

# వ్యవస్థాపక దినోత్సవం





**భువనగిరి, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :** మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆలేరు లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ 41వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీలం పద్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కలాంబ, మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీనియర్ మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలం పద్మ మాట్లాడుతూ గతంలో రజియా సుల్తానా, రుద్రమదేవి, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ తదితరులు మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణ త్యాగం చేసి మహిళా శక్తిని చాటారని పద్మ అన్నారు. నేటి మహిళలు నారి శక్తిని స్ఫూర్తిగా తీసుకొని మహిళా శక్తి చాటాలని అన్నారు. మహిళలు శక్తి వంతంగా పనిచేయాలని సూచించారు. 1984 సెప్టెంబర్ 15 రోజున బెంగళూరులో మహిళా కాంగ్రెస్ జాతీయ మహాసభ జరిగిందన్నారు. ఈ సభను స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, అప్పటి నుండి సెప్టెంబర్ 15న మహిళా కాంగ్రెస్ ఒక ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి దేశ వ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయిలలో విస్తరించిందన్నారు. మహిళా కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటామని తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించడం ఎంతో గర్వకారణం అన్నారు. మహిళా సాధికారత రాష్ట్ర భవిష్యత్తుగా ప్రతి ఒక్క మహిళ జీవితాలలో వెలుగులు నింపుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలుగా వ్యాపారంలో రాణించి తమ ప్రతిభతో రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తులో భాగస్వాములు కావాలని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ భాగస్వామ్యంతో మహిళా శక్తి పెట్రోల్ బంకులు, ఆర్టీసీ డ్రైవర్లుగా, ఓనర్లుగా మహిళా క్యాంటీన్ల ఏర్పాటు చేయిస్తూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా మహిళ కాంగ్రెస్ ముందుండాలని నీలం పద్మ సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పడమటి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి జి కవిత, వనజ రెడ్డి, పరంజ్యోతి, మండల అధ్యక్షులు గాదపాక దీప, పాము అనిత, లత, రేణుక, భానుమతి, పి. జ్యోతి సరోజనమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



# కొల్లి మాధవికి సముచిత స్థానం కల్పించడం పట్ల హర్షం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15, (తెలంగాణ దిశ) :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమితులైన కొల్లి మాధవి సోమవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ను మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా కొల్లి మాధవి రామచందర్ రావును ఘనంగా సన్మానించారు. బిజెపి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నేతలు ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కొన్ని మాధవి సముచిత స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత రామచందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, బిక్షపతి యాదవ్, సీనియర్ నాయకులు ప్రొఫెసర్ చంద్రమౌళి, సుమన్ రావు, కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రాజు, శిల్పారెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బారావు, పద్మ, ప్రసాద్, డివిజన్ నాయకులు మదన్ గౌడ్, సాయి కిషోర్, నారాయణమూర్తి, సంతోష్, శ్రీనివాస్ గుప్తా, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



# ఇదా 'సంక్షేమం'?



రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని నిలదీయడంతో సాంఘిక సంక్షేమ వసతి గృహాల దుస్థితి మళ్లీ చర్చలోకి వచ్చింది. పేద విద్యార్థులకు కనీస వసతులు కల్పించటంలో మన పాలకులు ఎంత నిర్లక్ష్యంగా, నిర్పూచీగా వ్యవహరిస్తారో చెప్పటానికి హైకోర్టు ధర్మాసనం ఉదహరించిన లెక్కలే సాక్ష్యం. మచ్చుకు ఐదు హాస్టళ్లను పరిశీలిస్తేనే ఇన్ని వైఫల్యాలూ, విస్తు పోయే విషయాలూ బయటపడ్డాయి. మారుమూల మండలాల్లో, గిరిజన ప్రాంతాల్లో వసతి గృహాలను సందర్శిస్తే మరిన్ని దుర్భర పరిస్థితులు కళ్లకు కడతాయి. నామమాత్రపు నిధుల కేటాయింపుతో, అరకొర వసతుల కల్పనతో సంక్షేమ విద్యార్థులు ఎలాంటి సమస్యల మధ్య చదువుకోవాల్సి వస్తుందో తెలిసొస్తుంది. అసలు ఇవి చదువుకు ఆసరా కేంద్రాలా ? లేక చిన్నపాటి కారాగారాలా ? అన్న సందేహాన్ని కలిగిస్తాయి. రాష్ట్రంలోని దాదాపు ఐదు వేల సంక్షేమ హాస్టళ్లలో ఆరు లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థుల కోసం ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో, ఏయే వసతులు కల్పిస్తున్నారో, క్షేత్రస్థాయి పరిస్థితులు ఎలా ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియంది కాదు. రెండొందల మంది విద్యార్థులకు రెండే టాయిలెట్లు ఉండడం, 16 మంది విద్యార్థులు ఒకే గదిలో పడుకోవాల్సి రావడం హైకోర్టు నియమిత బృందం పరిశీలనలో వెల్లడైన నిజాలు. ఆ కమిటీ సందర్శించని వేలాది హాస్టళ్లలోనూ ఇదే దుస్థితి ఏళ్ల తరబడి కొనసాగుతోంది. చుట్టూ రక్షణ గోడ లేకపోవడం, వాష్‌రూముల కొరత, తాగునీటి ఇబ్బందులు, స్నానానికి సమీప వాగులను ఆశ్రయించటం, అన్నంలో పురుగులు, కిటికీలు తలుపులూ సరిగ్గా లేని గదులూ.. రాష్ట్రంలో ఏ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించినా ఇందులో రెండో, మూడో సమస్యలు తారసపడకుండా ఉండవు. చలికాలంలో నేల మీద పడుకొని గజగజా వణకటం తప్ప వేరే ఏర్పాట్లు లేని వసతి గృహాలు ఎన్నో! 'మీ పిల్లలనైతే ఇలాగే పడుకోబెడ తారా?' అంటూ హైకోర్టు ధర్మాసనం సంబంధించిన అధికారులను, తద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయటంలో ఆవేదనతో కూడిన ఆగ్రహం ఉంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వమూ, అధికార యంత్రాంగమూ నిండు మనసుతో స్వీకరించి, తదనుగుణంగా స్పందిస్తాయా అన్నది సందేహమే! ఎందుకంటే- స్వయంగా హైకోర్టు ఇలా జోక్యం చేసుకొని, ప్రశ్నించటం, పరిస్థితిని చక్కదిద్దమని ఆదేశించటం ఇదే మొదటిసారి కాదు. గతేడాది కూడా ఒక కేసులో తీర్పునిస్తూ- సంక్షేమ హాస్టళ్లను ఎంత బాధ్యతాయుతంగా నిర్వహించాలో చాలా వివరణాత్మకంగా సూచనలు చేసింది. వాటిని ఆచరించటంలో పాలకుల పట్టింపులేని తనం నేటికీ కొనసాగుతూనే ఉంది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక %-% సంక్షేమానికి కోత పెట్టటం, కార్పొరేట్లకు దోచి పెట్టటం ప్రభుత్వాలకు ఒక అలవాటుగా మారిపోయింది. ఇందులో భాగమే అరకొర నిధులతో హాస్టళ్లను నిర్వహించటం, విద్యార్థులు అవస్థలతో సతమతమవుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరించటం. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థి సంఘాలు హాస్టళ్లలో సర్వేలు నిర్వహించి, సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తున్నాయి. ఇప్పుడు హైకోర్టు ప్రస్తావించిన సమస్యలు వంటి వాటినే సోదాహరణంగా అధికారుల ముందు ఏకరువు పెడుతున్నాయి. యూనివర్సిటీల్లో, ట్రిపుల్ ఐటిల్లో, సంక్షేమ హాస్టళ్లలో కొలువై ఉన్న సమస్యలపై ఏటా విద్యార్థులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులు కనీస వసతులపై పోట్లాడాల్సిన స్థితిలోకి ప్రభుత్వ నిర్వాహకమే నెట్టి వేస్తోంది. హైకోర్టు తాజా జోక్యంతోనైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలి. విద్యార్థులు నిశ్చింతగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలి. జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలి. హాస్టళ్లకు రక్షణ గోడలు, అవసరమైనన్ని మరుగుదొడ్లు, గదులుబీ విద్యార్థినులకు ప్రత్యేక రక్షణ వంటివి ఏర్పాటు చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలి. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను మొక్కుబడిగా తీసుకోకుండా- మెరుగైన సమాజ నిర్మాణానికి అది అత్యంత కీలకమైన బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే బడుగు, బలహీన వర్గాల బతుకుల్లో విద్యా ప్రకాశం వెల్లివిరిస్తుంది.

## దారి మళ్లుతున్న ఇందిరమ్మ ఇసుక..?!

కరీంనగర్, తెలంగాణ దిశ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలించే వేసులుబాటు కల్పించింది. ఈ నిబంధనలను ఆసరాగా చేసుకొని కొంతమంది జేబులు నింపుకుంటున్నారు. వేములపల్లి మండలం రావులపెంట గ్రామంలోని మూసి వాగు నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పేరిట పరిమిషన్ తీసుకొని వేరొక చోట అమ్ముకొని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలించి మార్కెట్లో విక్రయించి సొమ్ము కూడాబెట్టుకుంటున్నారు. ఇదంతా తెలిసినప్పటికీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు పంచాయతీ కార్యదర్శి ఇల్లు మంజూరైనట్లు తహసిల్దార్ కు తెలియజేస్తారు. దీంతో తహసిల్దార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వ్యక్తికి ఇసుక కొరకు అనుమతులు ఇస్తారు. అనుమతి తీసుకున్న వారికి మాత్రమే ఇసుకను తరలించాలని నిబంధనలు ఉంటాయి. కానీ అనుమతి ఒకచోట అన్లోడింగ్ మరొకచోట చేస్తూ దళారులు ధనార్జనే ధ్యేయంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. మండలంలోని రావులపెంట వాగు నుంచి గత కొద్ది రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ ఇసుక రవాణా పగలు రాత్రి తేడా లేకుండా అధికారుల కనుసన్నల్లోనే సాగుతుందని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు. అనుమతుల పేరిట ఆదివారం కూడా జోరుగా ఇసుక రవాణా చేస్తున్నారు. ప్రకృతి సంపదను దర్జాగా దోచుకుపోతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకోవడంతో ఇసుక ధరలకు రెక్కలు వచ్చాయి. రోజురోజుకు ఇసుక ధరలు పెరుగుతుండడంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. మూసి వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇల్లు నిర్మించుకునే క్రమంలో దగ్గరలోని వాగు నుంచి పర్మిషన్ తీసుకుంటే.. రూ . 2500 ట్రాక్టర్ ఇసుక విక్రయించాల్సి ఉంది. కానీ అక్రమంగా రూ .500 నుంచి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. ట్రాక్టర్ యజమానులు పర్మిషన్ల సాకుతో సాకుగా చూపుతూ ఇతరులకు ఒక్కొక్క ట్రాక్టర్ కు రూ.5000 వేల చొప్పున అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అదనంగా 2000 రూపాయలు రావడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను వదిలేసి బయటి వ్యక్తులకు ఇసుక విక్రయించేందుకు ట్రాక్టర్ యజమానులు మొగ్గుచూపుతున్నట్లు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకుని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇసుక అందేలా చూడాలని ఇందిరమ్మ లబ్ధిదారులతోపాటు, ప్రజలు కోరుతున్నారు.

## కాకాణి... ఓవర్... ఇప్పుడు అనిల్



నెల్లూరు, తెలంగాణ దిశ : నెల్లూరులో మరో వైసీపీ కీలక నేత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కూటమి హిట్ లిస్ట్‌లో ఉన్న లీడర్లలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఒకరని టీడీపీ నేతలు ఆఫ్ ది రికార్డులో చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఓడినప్పటి నుంచి నెల్లూరుకు దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు అనిల్‌కుమార్ యాదవ్. అయితే లేటెస్ట్‌గా మైనింగ్ కేసులో అనిల్‌కుమార్‌కు ఉచ్చు బిగిసేలా కనిపిస్తోంది. క్వార్జ్ అక్రమ తవ్వకాలతో వందల కోట్లు పోగేశారని ఆరోపిస్తూ నెల్లూరుకు చెందిన వైసీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారురుస్తుం మైన్స్ తవ్వకాల్లో నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇప్పటికే అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. ఇక వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు హైదరాబాద్లో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు చెబుతున్నా రు. ఇప్పుడు శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఆధారంగా అనిల్ కుమార్ యాదవ్‌పై చర్యలు తీసుకుంటే నెల్లూరులోని ముఖ్యమైన ఇద్దరు నేతలు ఇరుక్కున్నట్లేనని అంటున్నారు. అక్రమ క్వార్జ్ తవ్వకాలతో సంపాదించిన సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు శ్రీకాంత్ రెడ్డి విచారణలో చెప్పారంటున్నారు. లీజు గడువు ముగిసినా రుస్తుం మైన్ నుంచి క్వార్ట్స్ తీశామని..మాజీ మంత్రి కాకాణి, అనిల్ కుమార్ యాదవ్ అండతో గూడూరు, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో మామూళ్లు వసూలు చేశామని శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారటటన్ను క్వార్జ్‌కు రూ. 7వేల నుంచి రూ. 10 వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని చెబుతున్నారు. మైనింగ్ ద్వారా వసూలు చేసిన డబ్బుతో భారీగా భూములు కొని,వందల ఎకరాల భూమిలో రియల్ వెంచర్లు వేశారనే అలిగేషన్ ఉంది. అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటికే 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో కాకాణి 2 నెలలుగా రిమాండ్లో ఉన్నారు. త్వరలోనే అనిల్‌కుమార్ యాదవ్‌కు అరెస్ట్ చేస్తారని ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ముందు నుంచి టీడీపీకి టార్గెట్‌గా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. 2014లో టీడీపీ పవర్‌లో ఉన్నప్పుడు అపోజిషన్‌లో ఆయన చేసిన హడావుడి ఒక ఎత్తు అయితే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను ఉద్దేశించి అనిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కూటమి ఇంకా మరిచిపోలేదంటున్నారు. టైమ్ చూసి.. అన్ని ఆధారాలు దొరికినప్పుడు ఏదో ఒక కేసులో అనిల్‌కుమార్‌ను రౌండప్ చేస్తారని కూటమి పవర్‌లోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. అయితే శ్రీకాంత్‌రెడ్డి అరెస్ట్‌తో అనిల్ కుమార్ వసూళ్ల దందా..అక్రమ మైనింగ్ వ్యాపారం మొత్తం వెలుగులోకి వచ్చిందని అంటున్నారు. పక్కా ఆధారాలు దొరికాయని.. శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంతో అనిల్‌కుమార్ ఇరికిపోవడం పక్కా అన్న ప్రచారం బయలుదేరింది. ఈనేపథ్యంలోనే ఈ వీకెండ్‌లో అనిల్‌కుమార్ అరెస్ట్ ఉండొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏం జరగబోతుందో చూడాలి మరి.

## బ్రిటన్‌తో ఒప్పందం.. ప్రజారోగ్యానికి దెబ్బ

### అధిక కొవ్వు, చక్కెర ఉత్పత్తులపై సుంకాలు రద్దు



న్యూఢిల్లీ : బ్రిటన్‌తో ప్రధాని నరేంద్ర మోడి కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతీయుల ప్రజారోగ్యాన్ని దెబ్బతీయనుందనే ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఒప్పందం బ్రిటన్ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, సాఫ్ట్ డ్రింక్స్ వంటి అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు (హెచ్‌ఎఫ్‌ఎ స్‌ఎస్) ఉత్పత్తులను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. దీనివల్ల ఈ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. తక్కువ ధరలు, మార్కెటింగ్, ప్రకటనల ప్రచారాలతో ఈ ఉత్పత్తుల వినియో గం అమాంతం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇవి ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు మెక్సికో గుణపాఠం..: మెక్సికో, అమెరికా, కెనడా మధ్య 1992లో నార్త్ అమెరికన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరిగింది. అనంతరం మెక్సికో బలమైన ప్రజారోగ్య రక్షణ చర్యలను అమలు చేయడంలో విఫలమైంది. దీంతో చౌకగా సాఫ్ట్ డ్రింక్స్, స్నాక్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్ దిగుమతులు భారీగా పెరిగాయి. హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్ ఉత్పత్తుల వినియో గం పెరిగింది. ఫలితంగా మెక్సికోలో ఊబకాయం, మధుమేహం వంటి ఆహార, సంబంధిత వ్యాధులు విపరీతంగా పెరిగాయి. దీన్ని అధిగమించడానికి 2014లో మెక్సికో 'సోడాటాక్స్', ప్యాకెట్లపై హెచ్చ రిక లేబుల్స్‌వంటి కఠిననియంత్రణలను ప్రవేశపెట్టింది. తద్వారా ఈ సమస్యను కొంత నియంత్రించగలిగింది. బ్రిటన్‌లో హెచ్‌ఎఫ్‌ఎస్ ఎస్‌ఉత్పత్తులపై కఠిన నియంత్రణలుఅమల్లో ఉన్నాయి. అక్కడి అహార ఉత్పత్తుల ప్యాకింగ్‌లపై కొవ్వు, చక్కెర, ఉప్పు స్థాయిలను రంగుల ద్వారా సూచిస్తుంది. ఇది వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఎంపిక లు చేసుకోవడానికి, అప్రమత్తంగా ఉండటానికి సహాయ పడుతాయి. భారత నియంత్రణ సంస్థలు విఫలం: మెక్సికో, యుకె తరహాలో భారత్‌లో ఇలాంటి నియంత్రణలు లేకపోవడం లేదా ఉన్నవి సమర్థవంతంగా అమలు కాకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇక్కడ జంక్ ఫుడ్ ప్రకటనలపై ఎలాంటి బైండింగ్ ఆంక్షలు లేవు. పిల్లలను లక్ష్యంగా చేసుకునే చాకిలేట్ల వంటి ప్రకటనలపై నియంత్రణలు సమర్థవంతంగా అమలు కావడం లేదు.

భారత్‌లో తప్పుదారి పట్టించే ప్రకటనలను గుర్తించడంలో లేదా శిక్షలు విధించడంలో నియంత్రణ సంస్థలు విఫలమవుతున్నా యి. బ్రిటన్ ఉత్పత్తుల దిగుమతి, వినియోగం పెరగడం వల్ల ప్రజారోగ్యానికి సవాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. యుకెలో ఉన్నట్లుగా బలమైన నియంత్రణలు, ప్యాకెట్లపై హెచ్చరిక సమాచా రం, ప్రకటనలపై ఆంక్షలు, పన్నుల వంటి చర్యలు భారత్‌లోనూ అమలు చేయకపోతే, మెక్సికోలో చూసినట్లుగా ఆరోగ్య సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రోజూ పరగడుపునే 2 తులసి ఆకులను నమిలి తినడం మరిచిపోకండి..

సాధారణంగా చాలా మంది ఇండ్లలో తులసి చెట్టు ఉంటుంది. హిందువులు తులసి చెట్టును పవిత్రంగా భావించి పూజలు కూడా చేస్తుంటారు. అయితే ఆయుర్వేదంలో తులసికి ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. దీన్ని క్వీన్ ఆఫ్ హెర్బ్స్‌గా పిలుస్తారు. ఈ మొక్క ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. పలు ఆయుర్వేద ఔషధాలను తయారు చేయడంలోనూ తులసి ఆకులను ఉపయోగిస్తారు. తులసి ఆకులను 2 లేదా 3 తీసుకుని రోజూ ఉదయం పరగడుపునే నమిలి తింటుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. తులసి ఆకుల్లో అడాప్టొజెనిక్ గుణాలు ఉంటాయి. అంటే ఈ ఆకులను తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట ప్రశాంతంగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

సీజనల్ వ్యాధులకు చెక్..: తులసి ఆకుల్లో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధికంగా ఉంటుంది. యూజినాల్ అనే సమ్మేళనం కూడా అధికంగానే ఉంటుంది. అందువల్ల తులసి ఆకులు యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటాయి. ఈ ఆకులను తింటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లు, రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి సైతం త్వరగా కోలుకుంటారు. తులసి ఆకులతో తయారు చేసే ఔషధాలను శ్వాసకోశ సమస్యలను తగ్గించేందుకు సైతం ఉపయోగిస్తున్నారు. ఈ ఆకులను తింటే గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాసనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి.

దయాబెటిస్ ఉన్నవారికి..: తులసి ఆకులను పరగడుపునే తింటుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఈ ఆకులను తినడం వల్ల పలు జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. దీంతో అజీర్తి ఏర్పడదు. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. తులసి ఆకులను తినడం వల్ల శరీరంలో ఉన్న వ్యర్థాలు బయటకు పోతాయి. ముఖ్యంగా జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలను శరీరం సులభంగా బయటకు పంపిస్తుంది. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఈ ఆకులను పరగడుపునే తింటుంటే మలబద్దకం తగ్గుతుంది. షుగర్ ఉన్నవారికి తులసి ఆకులు ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకుల్లో ఉండే సమ్మేళనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచేలా చేస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు రోజూ ఈ ఆకులను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

దంతాలు, చిగుళ్లకు..: తులసి ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అధికంగా ఉన్న కారణంగా గుండెకు ఎంతో మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గేలా చేస్తాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. తులసి ఆకులను నోట్లో వేసుకుని బాగా నమిలి తింటుంటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది.

## ప్రొఫెసర్ ఎంత పనిచేశాడో...?

హైదరాబాద్, తెలంగాణ దిశ : హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన పొరపాటుతో 138 మంది విద్యార్థులు తమ చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సబ్జెక్టు జవాబు పత్రాలను తప్పు ప్రశ్నపత్రంతో దిద్దడమే దీనికి కారణం. ఓ విద్యార్థి ఫిర్యాదుతో తప్పును గుర్తించిన అధికారులు, సరిచేసిన ఫలితాల ను ప్రకటించారు. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణుల య్యారు, అయితే ప్రొఫెసర్ నిర్లక్ష్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన చిన్న తప్పు కారణంగా మూడు కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పరీక్షా ఫలితాలు ఆలస్యంగా వెలువడ టం, అందులోనూ తమ పిల్లలు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ కావటం తెలిసి తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి చేసిన ఫిర్యాదుతో పొరపాటును అధికారులు గుర్తిం చిన అధికారులు ఫలితాలను సరిచేసి తిరిగి ప్రకటించారు. వివరాల్లోకి వెళితే.. గత నెలలో జరిగిన జేఎన్‌టీయూ బీటెక్ నాలుగో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఈ నెల 17న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో చివరి ఏడాదిలో ఉండే క్రెడిట్ బేస్డ్ సబ్జెక్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ లో శ్రీదత్త, మల్లారెడ్డి, షాదన్ కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడం వారిని తీవ్ర మనోవేదనకు గురిచేసింది. దీనివల్ల తమ భవిష్యత్తు, ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన చెందారు. శ్రీదత్త కాలేజీకి చెందిన ఒక విద్యార్థికి ఈ ఫలితాలపై అనుమానం వచ్చి జేఎన్‌టీయూ పరీక్షల విభాగానికి మెయిల్ చేశాడు. ఇఎం సబ్జెక్టులో ఇంతమంది ఫెయిల్ అవ్వడానికి అవకాశం లేదని, మరోసారి ఫలితాల ను చెక్ చేయాలని కోరాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఫలితాల ను తనిఖీ చేయగా.. నిజంగానే 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు గుర్తించారు.


ఆ తర్వాత వారి జవాబు పత్రాలను పరిశీలించ గా.. వాటిని దిద్దిన ప్రొఫెసర్ ఘోరమైన పొరపాటు చేసినట్లు తేలింది. పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో వేర్వేరు ప్రశ్నపత్రాలతో ఎగ్జామ్ నిర్వహించారు. అయితే ఆ ప్రొఫెసర్ ఉదయం ప్రశ్నపత్రంతోనే సాయంత్రం సెషన్ జవాబు పత్రాలను కూడా దిద్దినట్లు గుర్తించారు. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే.. అధికారులు సాయంత్రం ప్రశ్నాపత్రంతో జవాబు పత్రాలను మళ్ళీ దిద్దించారు. ఫలితంగా, ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు. గురువారం రాత్రి సరిచేసిన ఫలితాల ను తిరిగి ప్రకటించారు. ఈ వార్త తెలియగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక ప్రొఫెసర్ నిర్లక్ష్యం కారణంగా ఇంతమంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురికావడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన జేఎన్‌టీయూ పరీక్షల పర్యవేక్షణలో లోపాలను ఎత్తి చూపిందని అంటున్నారు.

# టెక్నాలజీతో నెంబర్ వన్ గా మారిన అహ్మదాబాద్ సిటీ




గాంధీనగర్, : గుజరాత్‌లోని అహ్మదాబాద్ దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది. స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆ నగరం అనేక చర్యలు తీసుకుంటోంది. వరదలను నివారించడానికి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ, రియల్ టైమ్ పర్యవేక్షణ చేస్తోంది. అయితే హైదరాబాద్‌ను మాత్రం వరదల సమస్య పట్టిపీడిస్తోంది. జాతి పిత మహాత్మా గాంధీ పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. పొలిటికల్ ఫ్రీడమ్ కంటే పరిశుభ్రతే ముఖ్యం అని ఆయన చెప్పారు. పారిశుద్ధ్యం లేకుండా కేవలం రాజకీయ శక్తి ఏం చేయలేదని అన్నారు. అయితే మహాత్ముని మాటలే అక్షరాలా పాటిస్తూ..దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది గుజరాత్‌లోని అహ్మదాబాద్. పది లక్షల కన్నా జనాభా ఎక్కువ ఉన్న పెద్ద నాగరాల్లోకెల్లా.. క్లీనెస్ట్ సిటీగా నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి.. తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంటూ వస్తోందీ సిటీ.పరిశుభ్రత విషయంలో మేటిగా ఉన్నా.. ఈ నగరాన్ని వరదలు వేధిస్తున్నాయి. ఇప్పుడు ఈ నగరం ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అహ్మదాబాద్ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఎలా అమలు చేస్తున్నారు? వరదల నివారణకు అహ్మదాబాద్ ఏం చేస్తోంది? చిన్న వర్షానికే రోడ్లు నదులుగా మారే హైదరాబాద్.. దాన్నుంచి ఏం నేర్చుకోవచ్చు అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 జాబితాలో టాప్‌లో నిలిచిన అహ్మదాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ అవార్డ్ బహూకరించారు. భోపాల్, లఖ్‌నవూ.. తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఇక ఇండోర్, సూరత్, నవీ ముంబై వంటి సిటీలు సూపర్ స్వచ్ఛ్ లీగ్ గ్రూప్‌లోకి వెళ్లగా.. హైదరాబాద్ ఆరో స్థానంలో నిలిచింది. కంటోన్మెంట్ బోర్డు ర్యాంకుల్లో.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు తొలి స్థానంలో నిలిచి రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఈ లిస్ట్‌లో అహ్మదాబాద్‌కు మొదటి స్థానం ఊరికే రాలేదు. దాని కోసం అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చాలా శ్రమించింది. అనేక చర్యలు చిత్తశుద్ధితో అమలు చేసింది.అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిరోజు 20 లక్షల గృహాలు, 5 లక్షల కమర్షియల్ ప్రాపర్టీల నుంచి చెత్త సేకరిస్తోంది. ఇందుకోసం జీపీఎస్ ఉన్న 1,850 పైగా వాహనాలు ఉపయోగిస్తోంది. 4800 మంది రాత్రి రోడ్లు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులతో సహా మొత్తం 9000 మంది, 56 మెకానికల్ రోడ్ స్వీపింగ్ మెషీన్లు ప్రతిరోజు 1500 కిలో మీటర్ల రోడ్లను ఊడుస్తున్నాయి. నగరంలో 43,000 పాయింట్లను గుర్తించి.. టార్గెటెడ్ మెయింటేనెన్స్ చేస్తున్నారు.తెలంగాణలో ఇంతకుముందు చేసినట్లే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. రెడ్యూస్, రీ-యూజ్, రీసైకిల్ అనే త్రీఆర్ సూత్రాల ఆధారంగా చెత్త నిర్వహణ చేస్తున్నారు. నగర సాలిడ్ వేస్ట్‌ను 100 శాతం ప్రాసెస్ చేస్తున్నారు. 'మై థైలీ' (పాత దుస్తుల నుంచి క్యారీ బ్యాగ్‌లు తయారు చేయడం) వంటి వాటిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు.రెగ్యులర్‌గా మెయింటేన్ చేసే పబ్లిక్ టాయిలెట్లను నగరవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. 250 పైగా టాయిలెట్లను రెనోవేట్ చేశారు. మహిళల కోసం పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. డ్రైనేజీ, పైపులైన్ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేశారు. వేస్ట్ టూ ఆర్ట్ అనే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.పిరానా డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన 12.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చెత్తను మొత్తం ప్రాసెస్ చేశారు. బయోరీమిడియేషన్ పద్ధతిలో తొలగించి.. దాన్ని రెఫ్యూజ్ డెరైవ్డ్ ఫ్యూయెల్ - రీసైకిల్ చేయలేని సాలిడ్ వేస్ట్‌ను ప్రాసెస్ చేస్తే వచ్చే ఇంధనం), ఇనర్ట్ మెటీరియల్‌గా (సాధారణ పరిస్థితుల్లో ఇతర పదార్థాలతో రియాక్షన్ కానివి, మట్టిలో అంత త్వరగా కలిసిపోనివి) మార్చారు.రోజుకు 1,000 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్.. 15 మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. ఇక పొడి చెత్తను నిర్వహించేందుకు 9 మెటీరియల్ రికవరీ ప్లాంట్లను మహిళను ఆపరేట్ చేస్తున్నారు. నగరంలోని గోడలపై అందమైన కళారూపాలను వేస్తున్నారు. అలాగే చారిత్రక వారసత్వ కట్టడాలు, ప్రాంతాల వద్ద, పబ్లిక్ ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపడుత న్నారు.పరిశుభ్రత నిబంధనలు పాటించని వారికి జరిమానాలతో బుద్ధి చెబుతోంది అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ఇప్పటివరకు ఫైన్ల రూపంలో రూ.12 కోట్లు వసూలు చేసిందంటేనే..
ఎంత పకడ్బందీగా నిబంధనలు అమలు చేస్తోందో తెలుసుకోవచ్చు. చెత్త నిర్వహణ సమర్థంగా చేయడానికి ఏఎంసీ టెక్నాలజీని ఉ పయోగించుకుంటోంది. చెత్త కుండీలు, చెత్త సేకరించే వాహనాలకు జీపీఎస్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ట్యాగ్‌లు జతచేశారు. దీని ద్వారా వేస్ట్ కలెక్షన్ రూట్లు, వాహనాల కదలికలు, చెత్త నిర్వహణ సమర్థతను.. సెంట్రల్ కంట్రోల్ రూమ్‌తో పర్యవేక్షిస్తున్నారు. ఇక చెత్త సేకరణ, ట్రాన్స్‌పోర్టేషన్‌ను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లకు సరైన సమయంలో ఏఎంసీ పేమెంట్లు చేస్తోందని తెలుస్తోంది. దానివల్ల జవాబుదారీ తనం ఉంటోందని సమాచారం. ప్రజల ఫిర్యాదులను కూడా ట్రాక్ చేసి, పరిష్కరిస్తున్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో వరదల నిర్వహణను కూడా పరోక్షంగా పరిగణలోకి తీసుకుంటారు. అర్బన్ వాటర్, సానిటేషన్ మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేవా అని కూడా లెక్కిస్తారు. అయితే వరదలను నియంత్రించడంలో అహ్మదాబాద్ కూడా చాలా సవాళ్లు ఎదుర్కొంటోంది. నగరంలో మూడింట్లో ఒకవంతు మాత్రమే డ్రైనేజీ నెట్వర్క్ ఉంది. కానీ, హైదరాబాద్‌తో పోలిస్తే అహ్మదాబాద్ మెరుగైన చర్యలు తీసుకుంటోంది.ఆ 14 గ్రామాల్లో ఇద్దరు సర్పంచ్‌లు, రెండు రాష్ట్రాల స్కీమ్‌లు.. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య పంచాయితీ తెగేదెలా? ప్రజల కోరిక ఏంటి?వరదలను అంచనా వేయడానికి 25 ఆటోమెటిక్ రెయిన్ గేజ్‌లను అహ్మదాబాద్ మోహరించింది. 19 కంట్రోల్ రూమ్‌లు, 2500 సీసీటీవీ కెమెరాలతో రియల్‌టైమ్ పర్యవేక్షణ, ప్రతిస్పందనలను చూసుకుంటోంది. నగరవ్యాప్తంగా ఇంకుడు గుంతలను నిర్మిస్తోంది. దీనివల్ల వరద రిస్క్ తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. ఇక లొకేషన్ స్పెసిఫిక్ వరద నిర్వహణ మోడల్స్ అభివృద్ధి చేయడానికి ఐఐటీ గాంధీనగర్, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.మరోవైపు, హైదరాబాద్‌లోనూ వరద సమస్య తీవ్రంగా ఉంది. చిన్న వర్షం పడితేనే రోడ్లు జలమయం అవుతున్నాయి. గచ్చిబౌలి లాంటి ప్రాంతాల్లో కూడా రోడ్లు నదుల్లా మారాయి. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురవడం, సరైన డ్రైనేజీ నిర్వహణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. చిన్న వర్షానికే రోడ్లపై పొంగిపొర్లే డ్రైనేజీలు చూస్తే.. సిటీ డ్రైనేజీ వ్యవస్థ ఏ తీరున ఉందో చెబుతోంది. రోడ్లే కాదు, ఆఖరికి ఫ్లైఓవర్లు కూడా నదుల్ని తలపిస్తున్నాయంటే.. వరద నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న అర్బన్ ప్రాంతాలు పరిశుభ్రతతో పాటు వరద నిర్వహణపై కూడా శ్రద్ధ పెట్టాలి. ఇక దాదాపు 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన అహ్మదాబాద్, హైదరాబాద్ లాంటి నగరాలు మరింత దృష్టి సారించాలి. పరిశుభ్రత, వరద నిర్వహణ వంటి విషయాల్లో అహ్మదాబాద్, సూరత్, ఇండోర్ వంటి నగరాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసి.. వాటిని హైదరాబాద్‌కు ఉపయోగపడేలా మలచుకోవాలి. అప్పుడే సుందర, సురక్షిత భాగ్యనగరం సాకారం అవుతుంది.

# విశాఖ రైల్వే జోన్ పనులు షురూ..




విశాఖపట్టణం,: ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైల్వే జోన్ ఏర్పాటులో మరో ముంద డగు పడింది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. జోన్ పరిధి, డివిజన్లు, సిబ్బంది, ఇతర వివరాలతో కూడిన నివేదికను రైల్వే బోర్డుకు పంప గా.. పరిశీలించి కొన్ని మార్పులతో ఆమోదం తెలిపింది. ఈ మేరకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జోన్ సరిహద్దులు, డివిజన్లు, సిబ్బంది వివరాలతో కూడిన డీపీఆర్‌ను ఆమోదించింది. రైల్వే బోర్డు కొన్ని ప్రతిపాదనలను తిరస్కరి ంచగా.. కొత్తగా పోస్టులు సృష్టించకూడదని, ఉన్న సిబ్బందిని సర్దుబా టు చేయాలని ఆదేశించింది.దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆస్తులు, సిబ్బం దిని కొత్త జోన్‌కు బదిలీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రైల్వే బోర్డు.. నీ తూర్పు కోస్తా రైల్వే, దక్షిణ మధ్య రైల్వే జోన్ల పరిధిలోని సిబ్బంది, ట్రాక్ మెషీన్లు బదిలీ చేయడానికి అంగీకరించలేదు. జోన్‌కు సంబంధించి విశాఖపట్నంలో చేపట్టబోయే సివిల్ పనుల కోసం మరో రూ.200 కోట్లు కావాలని డీపీఆర్‌లో కోరారు. వెంటనే ప్రతిపాదనలు పంపితే.. వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రైల్వే బోర్డు ముడసర్లోవలో హెల్త్ యూనిట్ ఏర్పాటును తిరస్కరించింది.. కొత్తగా జీఎం పోస్టు మినహా ఇతర పోస్టులు సృష్టించ కూడదని తేల్చి చెప్పింది. రైల్వే బోర్డు గుణుపూర్-పర్లాఖె ముండి సెక్షన్, నౌపద-గుణుపూర్ లైన్‌ను.. గుణుపూర్-తేరుబలి కొత్త లైన్ పూర్తయ్యే వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచాలనే ప్రతిపాదనకు నో చెప్పింది.రైల్వే బోర్డు విశాఖపట్నం డివిజన్‌కు అవసరమైన సిబ్బంది కోసం (అధికారులు, సిబ్బంది ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే కేటాయిస్తామని, ఫీల్డ్ సిబ్బందిని మాత్రమే విభజిస్తారు) డీపీఆర్‌లో చేసిన ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నంలో రైల్వే అధికారులు నివాసం ఉండేందుకు అవసరమైన అద్దెకు తీసుకునే ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలి అని రైల్వే బోర్డు సూచనలు చేసింది. మొత్తం మీద రైల్వే బోర్డు విశాఖపట్నం రైల్వే జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే మిగిలిన పనులు మొదలవుతాయంటున్నారు.

# మెడికల్ లీవ్ లో పైలెట్లు

ముంబై, : అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ దుర్ఘటన తర్వాత నాలుగు రోజుల్లో 100 మందికిపైగా ఏయిరిండియా పైలట్లు మెడికల్ లీవ్ తీసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. కేంద్ర పౌరవిమాన యాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహుల్ లోక్‌సభలో ప్రసంగిస్తూ.. 274 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద ఘటనపై పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది అని అన్నారు. విమాన ప్రమాదం జరిగిన రోజే 51 మంది పైలట్లు, 61 మంది ఫ్లైట్ ఆఫీసర్లు లీవ్ పెట్టడం ప్రభుత్వం దృష్టిని ఆకర్షించింది.ఇటువంటి ఘటనల తర్వాత సిబ్బందిలో మానసిక ఒత్తిడిని గుర్తించి, దాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని మంత్రి వ్యాఖ్యానించారు. 2023 ఫిబ్రవరిలోనే కేంద్రం అన్ని ఎయిర్‌లైన్స్‌కు పలు సూచనలు చేసింది. వైద్య పరీక్షల సమయంలో పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడం, పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, పియర్ సపోర్ట్ గ్రూపులు ఏర్పాటు చేసి, పైలట్లు, ఏటీసీలకు మానసిక ఒత్తిడిని గుర్తించేందుకు, ఎదుర్కొనేందుకు సహాయం చేయాలని సూచించింది.కాగా, సిబ్బంది విశ్రాంతి, శిక్షణ, ఆపరేషన్ లోపాలపై డీజీసీఏ నుంచి నాలుగు షోకాజ్ నోటీసులు అందినట్టు ఎయిరిండియా ధ్రువీకరించింది. గతేడాది తమ సంస్థ అందజేసిన స్వచ్ఛంద నివేదిక ఆధారంగా ఈ నోటీసులు జారీ అయినట్టు తెలిపింది. ఎయిరిండియా ప్రతినిధి స్పందిస్తూ: 'మా స్వచ్ఛంద నివేదికల ఆధారంగా వచ్చిన నోటీసులే... వాటికి తగిన విధంగా స్పందిస్తాం? సిబ్బంది, ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీలేదు' అన్నారు. కాగా, గత ఆరు నెలల్లోనే ఎయిరిండియాకు 13 భద్రతా ఉల్లంఘనల నోటీసులు రావడం గమనార్హం.రెండు రోజుల కిందట హాంకాంగ్ నుంచిడి ఢిల్లీకి వచ్చిన ం321 విమానంలో ల్యాండ్ అయిన కాసేపటికే మంటలు చెలరేగాయి. దీనికి ముందు రోజు కోచి-ముంబయి ఫ్లైట్ రన్‌వే అదుపుతప్పడంతో ఇంజిన్ కవర్ దెబ్బతింది. అలాగే, ఢిల్లీ-కోల్‌కతా విమానం చివరి నిమిషంలో టేకాఫ్ నిలిచిపోయింది. ఇలా వరుస ఘటనలు ఎయిరిండియా విమానాల్లో భద్రతపై ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటు, అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక అందజేసింది. పైలట్లు ఇంధనం స్విచ్ఛ ఆఫ్ చేసినట్టు కాక్‌పిట్ వాయిస్ రికార్డులో ఉందని విదేశీ మీడియా కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను పైలట్ల సంఘం, విమానయాన నిపుణులు తీవ్రంగా ఖండిస్తున్నారు. బోయింగ్ విమానాలు నడుపుతున్న అన్ని దేశీయ విమానయాన సంస్థలకు ఇంధన స్విచ్‌లను పరీక్షించాలని డీజీసీఏ ఆదేశించింది.

# రోజా నోరు తెస్తున్న తంటా!



తిరుపతి, : వైసీపీకి మాజీ మంత్రి రోజా లాంటి వారు అస్సెట్ అవు తారనుకుంటే భారంగా మారుతున్నారు. బరువుగా పార్టీకి తయారవు తున్నారు. అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా లాంటి వారితో ఉన్నదంతా తుడిచిపెట్టుకుపోతుంది. రోజా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగానే కాదు.. సాధారణ జనానికి కూడా మంట తెప్పిస్తున్నాయి. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్ల పాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణల్లో వాస్తవముంది. రోజా నోటికి ప్లాస్టర్ వేయాలని సొంత పార్టీ నేతలే కోరుతున్నారంటే ఆమె ఏ రేంజ్ లో మాట్లాడిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జగన్ ఇటువంటి నేతల విషయంలో సీరియస్ డెసిషన్ తీసుకోవాలంటున్నారు ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిందే. అయితే ఆ వ్యాఖ్యలతో వచ్చిన సానుభూతిని రోజా తన వ్యాఖ్యలతో తనకు తానే చెరిపేసుకున్నారు. పార్టీని కూడా డ్యామేజ్ చేశారు. నగరిలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న రోజా రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గాలిలో గెలిచిన గాలిగాళ్లే ఎక్కువైపోయారంటూ విమర్శలు చేశారు.
చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వీకెండ్ నాయకులు అని ఫైర్ అయ్యారు. ఒక్కరు కూడా ప్రజల దగ్గరికి వెళ్లి వాళ్ల కష్టం ఏంటో అడగరని రోజా అన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నేతలు అమెరికా పారిపోవాలని చెప్పారు. చంద్రబాబు డబ్బులు ఎక్కువగా ఇస్తున్నారని అందుకే పవన్ కళ్యాణ్‌కు పిచ్చి బాగా ముదిరిపోయిందంటూ ఆరోపించారు... రాష్ట్రంలో గాలిలో గెలిచిన గాలిగాళ్లు ఎక్కువైపో య్యారు. ఇప్పుడే హైదరాబాద్‌కు పారిపోయే వాళ్లు.. రేపు జగనన్న ప్రభుత్వం వస్తే వీళ్లు హైదరాబాద్ కాదు.. అమెరికాకు పారిపోతారంటూ రోజా చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బది పెట్టేవే. ఆ రోజు మిమ్మల్ని కాపాడటానికి ఎవ్వరు ఉండరని, వీళ్లని నమ్మితే ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లని మీరు టార్చర్ పెట్టినా.. కేసులు పెట్టించినా.. కొట్టినా.. దానికి 100 రెట్లు మీకు వడ్డీతో కూడా తిరిగి ఇచ్చేస్తామంటూ రోజా చేసిన హెచ్చరికలతో కాస్తో కూస్తో వైసీపీ నేతల వరస అరెస్ట్ లతో వచ్చిన సానుభూతి పోయిందని అంటున్నారు. రోజాకు ఆవేశం తప్ప ఆలోచన లేదని, సినీ రంగం నుంచి రావడంతో డైలాగులు ఆకట్టుకునేలా అనిపించినా అవి మాత్రం వచ్చే ఓట్లను రాకుండా చేస్తాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# చెత్త ఇవ్వండి... డబ్బులు తీసుకోండి

**విజయవాడ, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛ రథం పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పనికిరాని వస్తువులను సేకరిస్తారు. వాటికి బదులుగా డబ్బులు లెక్కించి, అవసర మైన సరుకులు ఇస్తారు. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 10న ప్రారంభమైన సంగతి తెలిసిందే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. పైలట్ ప్రాజెక్టు కు ఎంపిక చేశారు. ఈ మేరకు ఒక వాహనాన్ని అద్దెకు తీసుకున్నారు.. దానిని స్వచ్ఛ రథంలా మార్చారు. ఆగస్టు1 నుంచిఅధికారులు రోజూ రెండు వార్డులు తిరిగేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేశారు. ఈ మేరకు వారంలో రెండు సార్లు గ్రామాల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి చెత్తను సేకరిస్తారు.. వాటికి బదులు డబ్బులు లెక్కగట్టి వాహనం వెనుక భాగంలో ఉండే నిత్యావసర సరుకులు ఇస్తారు. వాహనం ముందు భాగంలో పొడి చెత్తను ఉంచుతారు. ఈకార్యక్రమం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామంటున్నారు.గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛరథం ద్వారా చెత్త, వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బులు విలువ కట్టి సరుకులు ఉచితంగానే అందజేస్తున్నారు. గుంటూరు సమీపం లోని 11 గ్రామాలకు స్వచ్ఛ రథం ప్రతి 15 రోజులకోసారి వెళ్లేలా ప్లాన్ చేశారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేయాలని సూచిస్తున్నారు. ప్రజలు ఆ వ్యర్థాలను తీసుకొచ్చి స్వచ్ఛ రథం దగ్గర అప్పగిస్తే.. తూకం వేసి కిలోకి రూ. 16 నుంచి రూ. 20 వరకు విలువ కడుతున్నారు. ఆ తర్వాత ఆ విలువను బట్టి నిత్యావసరాలు, వస్తువులు అందజేస్తున్నారు. స్వచ్ఛ రథం సిబ్బందికి ప్యాకెట్లు, ప్యాకింగ్ కవర్లు, పాత పేపర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పనికిరాని వస్తువులు, అట్టలు, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు, కంప్యూటర్లకు సంబంధించిన వస్తువులు, నూనె డబ్బాలు ఇలా పనికిరాని వస్తువుల్ని తీసుకొచ్చి ఇవ్వొచ్చు. ఈ స్వచ్ఛ రథం పర్యవేక్షణ కోసం సచివాలయం లోని ఓ ఉద్యోగిని కేటాయించారు అధికారులు.

# పీహెచ్‌సీలలో డీపీటీ వ్యాక్సిన్ కొరత?

**- నెల రోజులుగా అందుబాటులో లేని డీపీటీ వ్యాక్సిన్**
**- సబ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న చిన్నారులు, తల్లిదండ్రులు**

**బీబీనగర్, తెలంగాణ దిశ:** గత నెల రోజులుగా వ్యాక్సిన్ కొరతతో అం గన్‌వాడీ సెంటర్లు, సబ్ సెంటర్ల చుట్టూ చిన్నారులు, తల్లిదండ్రులు తిరుగు తున్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు డీపీటీ ( డిఫ్తీరియా, పెర్టుస్సిస్ టెటానస్ ) అనే వ్యాక్సిన్ వేయాల్సి ఉన్నా గత నెల రోజులుగా వ్యాక్సిన్ కొరత కారణంగా టీకాను వైద్యులు అందించలేకపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ కొరత ఉన్నదని, సెంటర్లలో స్టాక్ లేనందున ఆరోగ్య కేంద్రాల్లో చిన్నారులకు టీకా వేయలేకపోతున్నామని ఆశా కార్యకర్తలు, ఏ ఎన్.ఎం లు




తెలిపారు. కాగా వ్యాక్సిన్ అందుబాటు లో ఉన్నది లేనిది సరైన సమాచారం లేక తల్లిదండ్రులు తమ ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# 4000 టన్నుల బొగ్గు మాయం..



షిల్లాంగ్: మేఘాలయాలో సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది.ఆ నల్ల బంగారం మాయం కావడం పట్ల రాష్ట్ర సర్కారుపై హైకోర్టు సీరియస్ అయ్యింది. బొగ్గు ఎక్కడికెళ్లిందో చెప్పాలని కోర్టు నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఎక్సైజ్ శాఖ మంత్రి కిర్మెన్ షిల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బహుశా వర్షాలు, వరదల వల్ల ఆ బొగ్గు కొట్టుకుపోయి ఉంటుందని ఆయన అన్నారు. జోరు వానల వల్ల బొగ్గు మాయమై ఉంటుందన్నారు. రాజాజూ, డెంగన్‌గాన్ గ్రామాల్లో ఉన్న బొగ్గు నిల్వల నుంచి సుమారు 4 వేల టన్నుల బొగ్గు కనిపించకుండాపోయింది. ఆ కేసులో అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బొగ్గు మాయం గురించి అడిగిన సమయంలో మంత్రి మాట్లాడుతూ.. మేఘాలయాలో అత్యధిక వర్షపాతం కురుస్తుందని, మీకు ఈ విషయం తెలియదని, ఆ వానల వల్ల బొగ్గు కొట్టుకుపోయే ఛాన్సు ఉందని అన్నారు. బొగ్గు ఎలా అదృశ్యమైందో చెప్పడం తన ఉద్దేశం కాదు అని, సహజ పద్ధతిలో ఆ బొగ్గు మాయమైందా లేక అక్రమ విధానాల వల్ల అది పోయిందా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నట్లు ఆయన చెప్పారు. మేఘాలయాలో 2014 నుంచి బొగ్గు మైనింగ్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపేసింది. పర్యావరణ కారణాలు, అసురక్షిత పద్ధతుల వల్ల బొగ్గు తొవ్వకాలను నిలిపివేశారు. మేఘాలయాలో అక్రమ రీతిలో మైనింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ ఏడాది ఆరంభంలో ఈస్ట్ జైంతియా కొండల్లో బొగ్గు మైనింగ్‌ను ప్రారంభించారు. ఒకవేళ బొగ్గు మాయమైనా.. అది బ్రతకడం కోసమైతే అక్రమంగా జరిగి ఉంటుందేమో అని, లేదంటే ఆ బొగ్గును ఎవరు తీసుకెళ్తారని మంత్రి అన్నారు.

# అనిల్ కుమార్ మిస్సింగ్..!



**నెల్లూరు,, తెలంగాణ దిశ :** ధికారంలో ఉన్నప్పుడు ఎన్నైనా మాట్లాడవచ్చు. ఏవేవో మాట్లాడవచ్చు. ఎంతటి మాటలనైనా అనేయవచ్చు. కానీ అధికారం కోల్పోతే ఉంటుంది సామి రంగా. . అచ్చం అనిల్ కుమార్ యాదవ్ లా ఉంటుంది. ఓ చిన్నపాటి కేసులో విచారణకు ఆయనను పిలిచారు పోలీసులు. కానీ డుమ్మా కొట్టి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు అనిల్ కుమార్ యాదవ్. తనపై పోలీసులు పెట్టిన కేసు కొట్టి వేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అనిల్ కుమార్ యాదవ్ లో భయాన్ని చూసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముక్కున వేలేసుకుంటున్నాయి. ఏంటి మన అనిల్ యేనా? అని ఆశ్చర్యపోతున్నాయి. అనిల్ కుమార్ యాదవ్ తీరును చూసి నవ్వుకుంటున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు తొడలు కొడుతూ.. మీసం మేలేస్తూ అనిల్ కుమార్ యాదవ్ చేసిన హంగామా అంతా అంతా కాదు. ఇప్పటికీ ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.మొన్న ఆ మధ్యన నెల్లూరు జిల్లాలో ఒక వివాదం నడిచిన సంగతి తెలిసిందే. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పై (మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. అదే సమయంలో ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటి పై దాడి కూడా జరిగింది. అయితే ప్రసన్న కుమార్ రెడ్డిని పరామర్శించే క్రమంలో ప్రశాంతి రెడ్డి పై అనిల్ కుమార్ యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిని ఖండిస్తూ ప్రశాంతి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ కేసులో ఏ1 గా ప్రసన్న కుమార్ రెడ్డి, ఏ 2 గా అనిల్ కుమార్ యాదవ్ గా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణకు హాజరుకావాలని అనిల్ కుమార్ యాదవ్ కు నోటీసులు అందించారు. కానీ ఏ 1 గా ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి హాజరయ్యారు, ఏ 2 గా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ మాత్రం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అలా వెళ్తూనే హైకోర్టులో తనపై కేసు కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన విస్మయం వ్యక్తం అవుతుంది. చిన్నపాటి కేసుకే అనిల్ భయపడిపోతున్న తీరును వారు తప్పు పడుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్అధికారంలో ఉన్నప్పుడు అనిల్ కుమార్ యాదవ్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయేవారు. మీసం మేలేసేవారు.. తొడగొట్టేవారు. పవన్ కళ్యాణ్ తో పాటు లోకేష్ ను తక్కువ చేసి మాట్లాడేవారు. చంద్రబాబు వయసును చూసి కూడా గౌరవించిన దాఖలాలు లేవు. అయితే ఇప్పుడు అధికారం తారుమారు కావడంతో అసలు తత్వం బోధపడింది. ఎన్నికల ఫలితాల తర్వాత అనిల్ కుమార్ యాదవ్ రాష్ట్రంలోనే ఉండడం లేదు. పక్క రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే ఇప్పుడు అనవసరంగా వచ్చి చిన్నచిన్న కేసుల్లో ఇరుక్కుంటున్నారు. అసలు పెద్ద కేసులు ఆయన కోసం ఎదురుచూస్తున్నాయి. మున్ముందు చుక్కలు కనిపించే పరిస్థితులు ఉన్నాయి. కానీ చిన్నపాటి దూషణ కేసును కూడా ఆయన ఎదుర్కొనలేకపోతున్నారు. మున్ముందు పెద్ద కేసులు ఎదురైతే పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న వైసీపీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది.అయితే ప్రశాంతి రెడ్డి పై దూషణ కేసుకు సంబంధించి అనిల్ కుమార్ యాదవ్ భయపడడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి.

ఈ కేసులో ఏ 1 ఉన్న ప్రసన్న కుమార్ రెడ్డి ని పోలీసులు అరెస్టు చేయలేదు. కానీ తన విషయంలో మాత్రం అరెస్టు ఉంటుందని అనిల్ కుమార్ యాదవ్ కు తెలుసు. ఎందుకంటే క్వార్జ్ కుంభకోణం కేసులో ఆయన పిఏ ఇప్పటికే అరెస్టయ్యారు. ఆయన ఇచ్చిన సమాచారంతో అనిల్ కుమార్ కు కూడా ఈ కుంభకోణంతో సంబంధాలు ఉన్నాయని ఆధారాలు సేకరించారు పోలీసులు. అందుకే హైకోర్టు కలుపుతారు అనిల్ కుమార్ యాదవ్. పేరు దూషణ కేసు అయిన.. మైనింగ్ కుంభకోణం కేసులో బయటపడేందుకే నన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికైతే అనిల్ కుమార్ యాదవ్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది.

# సర్దుకోలేకపోతున్నాం

# జనసేన ఎమ్మెల్యేల మనోవేదన

**విజయవాడ, తెలంగాణ దిశ :** జనసేన ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారా? వారిలో ఫ్రస్టేషన్ పతాక స్థాయికి చేరుకుందా? టిడిపి తీరుపై ఆగ్రహంగా ఉన్నారా? కక్కలేక మింగలేక ఇబ్బంది పడుతున్నారా? ఎంతసేపు తమను సర్దుబాటు చేసుకోవాలన్న సూచనను వ్యతిరేకిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పైకి టిడిపితో సమన్వయం కొనసాగుతున్న.. లోలోపల మాత్రం జనసేన ఎమ్మెల్యేలు రగిలిపోతు న్నట్లు తెలుస్తోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి నేతల పెత్తనం కొనసాగుతుండడాన్ని వారు సహించలేకపోతు న్నారు. అలాగని నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తే సర్దుకోవాలని సూచి స్తున్నారు.ఇప్పటికే కొందరునియోజకవర్గజనసేన ఇన్చార్జులు అసంతృ ప్త స్వరం వినిపిస్తే వేటు వేస్తున్నారు. అందుకే ఎమ్మెల్యేలు సైతం వెనక్కి తగ్గుతున్నారు.తెలుగుదేశం కూటమిప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామి. 100% విజయంతో.. డిప్యూటీ సీఎం గా పవన్.. మరో ఇద్దరు జనసేన మంత్రులు.. మరో ఇద్దరు ఎంపీలు.. 21 మంది ఎమ్మెల్యేలతో జనసేన పటిష్ట స్థితిలో కనిపిస్తోంది. అయితే రాజకీయం గా మైలేజ్ ఇచ్చిన జనసేన ఎమ్మెల్యేల విషయంలో మాత్రం నియోజ కవర్గాల్లో ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ అంతా టిడిపి నేతల పెత్తనం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. పైగా అక్కడ టిడిపి నేతల మాటే చెల్లుబాటు అవుతోందని ప్రచారం నడుస్తోంది. ఆ పై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి లకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చారు.వారి మాటనే ప్రభుత్వంలోచెల్లుబాటు అవుతోంది. ఎమ్మెల్యేలు ఉన్నారంటే ఉన్నారు అన్నట్టు ఉంది జనసేన శాసనసభ్యుల పరిస్థితి. ఇది రోజు రోజుకు పతాక స్థాయికి చేరుకుంటుంది. దీనిపై జనసేన ఎమ్మెల్యేల్లోనే చర్చ నడుస్తోంది.వాస్తవానికి రాష్ట్రస్థాయిలో తప్పనిసరి పరిస్థితుల్లో పొత్తుకు అంగీకరించారు టిడిపి నేతలు. జనసేనకు కేటాయించిన 21 అసెంబ్లీ స్థానాలు టిడిపికి కంచుకోట లాంటివి. అక్కడ ఆ పార్టీకి బలమైన నాయకత్వం ఉంది. దశాబ్దాలుగా పాతుకుపోయిన నాయకులు సైతం ఉన్నారు. అటువంటివారు పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేశారు. ఇప్పుడు టిడిపి నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో సీట్లు త్యాగం చేసిన నేతలకు పదవులు దక్కాయి. పార్టీపరంగా ప్రాధాన్యం లభిస్తుంది. సీట్లు త్యాగం చేశారు కాబట్టి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యవర్గంలో సైతం చోటిస్తున్నారు. దీంతో వారు దూసుకుపోతున్నారు. సీనియర్లు కావడంతో అధికారులతో కూడా పనులు చేయించుకుంటున్నారు. వారితో చూసుకుంటే జనసేన ఎమ్మెల్యేల మాటలు కొన్నిచోట్ల చెల్లుబాటు కావడం లేదు. దీంతో వారికి అవమానాలు ఎదురవుతున్నాయి. అయితే ఒకటి కాదు రెండు కాదు దాదాపు జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతి నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి.జనసేన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ బాధను వ్యక్తం చేస్తే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదూకుడును నియంత్రించాలంటే పొత్తు కొనసాగాలని.. అలా కొనసాగాలంటే సర్దుబాటు చేసుకోవాలని జనసేన ఎమ్మెల్యేలకు నాయకత్వం సూచిస్తోంది. దీంతో ఒక రకమైన అసంతృప్తి ఎమ్మెల్యేల్లో ఉంది. పవర్ లేని ఈ పదవులు ఎందుకని.. టిడిపి నేతల మాటలే చెల్లుబాటు అవుతుంటే ఇక తాము ఉండి ఏమి ప్రయోజనమని ఎక్కువమంది బాధపడుతున్నారు. మున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే జనసేన ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా పక్కకు తప్పుకోవడం ఖాయమని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తప్పకుండా ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు.

# కూటమి టార్గెట్ అంతా రాయలసీమే

**అనంతపురం, తెలంగాణ దిశ :** కుంది. కడపలో కూడా వైసీపీ పట్టు నిలుపుకోలేకపో యింది. దాంతో మొన్నటి ఎన్నికల తర్వాత కూటమి కాన్సంట్రేషన్ ఓవర్ టు సీమ అయిపోయింది.వైసీపీని తిరిగి అక్కడ కోలుకోకుండా చేస్తే ఇంకో రెండు మూడు టర్మ్‌లు తమదే పవర్ అని అంచనా వేస్తోంది టీడీపీ. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మహానాడుకు కడపనే వేదికగా ఎంచుకుంది సైకిల్ పార్టీ. జగన్ కంచుకోటలో మూడురోజుల పాటు మహానాడు నిర్వహించి.. లక్షలాది మందితో సభ పెట్టి..జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో పసుపు మయం చేసి పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసే ప్రయత్నం చేసింది. తెలుగుదేశం పుట్టాక చాలా నగరాల్లో మహానాడు పెట్టారు. కానీ ఫస్ట్ టైమ్ హిస్టరీలో సాధించనన్ని సీట్లు సాధించిన తర్వాత కడపను టార్గెట్ చేస్తూ బ్రహ్మాండంగా పార్టీ పండుగను నిర్వహించి వైసీపీకి తన సత్తా ఏంటో చూపించింది టీడీపీ. సేమ్‌టైమ్ జనసేన పరంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వరుసగా కడప పర్యటనలు చేస్తూ.. జగన్ అండ్ వైసీపీ నేతలకు వార్నింగ్‌లు ఇస్తూ వస్తున్నారు. ఇప్పుడు కూటమిలో మరో మిత్రపక్షం వంతు అన్నట్లుగా ఉంది. బీజేపీ కూడా కడప నుంచే తన కార్యాచరణకు రెడీ అవుతోంది. బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. వాటిని కడప నుంచే మొదలు పెడతామని ప్రకటించారు. కడపను రాజకీయ కోణంలో కాకుండా ఆధ్యాత్మిక కోణంలో చూస్తున్నాం.. అందుకే కడపను ఎంచుకుంటున్నా మని చెబుతున్నారు.దేవుని తొలి గడప కడప అని మాధవ్ చెప్పారు. అందుకే సారధ్యం పేరుతో రాష్ట్ర పర్యటన త్వరలోనే మొదలవుతుందని అంటున్నారు. తొలి శాసనం దొరికిన జిల్లాగా అలాగే తెలుగు జాతి తెలుగు సంస్కృతికి ప్రధాన ద్వారంగా నిలిచిన కడప నుంచి పర్యటన స్టార్ట్ చేస్తామంటున్నారు. ఐదు విడతలుగా సారధ్యం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది. ఉత్తరాంధ్రకు చెందిన మాధవ్..అక్కడి నుంచే పార్టీ యాక్టివిటీస్‌ను మొదలెడతారని అంతా అనుకున్నారు. కానీ మాధవ్ తన తొలి రాష్ట్ర పర్యటనను రాయలసీమ నుంచి పైగా జగన్‌కు, వైసీపీకి హార్డ్ కోర్ జిల్లా అయిన కడప నుంచి ప్రారంభిస్తుండటం ఆసక్తికరంగా మారింది.కూటమి పార్టీలన్నీ తమ బలాన్ని పెంచుకోవడానికి కార్యక్షేత్రంగా కడపనే ఎంచుకుంటున్నాయి. పవన్ కూడా అనేక సార్లు రాయలసీమలో పర్యటిస్తూ వస్తున్నారు. కడపలో రచ్చబండ కార్యక్రమం పెట్టారు. ఆ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు పవన్. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడతా నంటూ ప్రకటిం చేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు..గూండా గిరి చేస్తే ఊరుకునే ది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్.కర్నూలు జిల్లాలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఇక కడపలో పర్యటించి..సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉ న్నాయని ఆరోపిస్తున్న అటవీ భూములను పరిశీలించారు. సీఎం చంద్రబాబు కూడా నెలలో కనీసం రెండు సార్లకు తక్కువ కాకుండా సీమ జిల్లాలటూర్లు వేస్తున్నా రు. ఇప్పుడు బీజేపీ కూడా రాయలసీమపైనే ఫోకస్ పెడుతోంది. దాంతో వైసీపీ వర్సెస్ కూటమిగా రాయలసీమ రాజకీయం మారిపోయింది.తిరిగి తన పట్టును సాధించేందుకు..గత వైభవం తెచ్చుకునేందుకు వైసీపీ ప్లాన్ చేస్తోంది. మూడు కీలక పార్టీలు అంతా కలసి సీమ మీద కన్ను వేయడంతో వైసీపీకి సవాల్‌గా మారింది. జగన్ కంచుకోట సెంట్రిక్‌గా కూటమి పార్టీలు చేస్తున్న ప్లాన్లు ఎంత వరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# 5 రోజుల్లో లక్ష కోట్లకు పైగా సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొని ఉంటాయి. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ముందుగానే మనం ఊహించలేం. మార్కెట్లపై సరైన అవగాహన ఉన్నప్పుడే.. ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ప్రణాళికలు, పెట్టుబడి వ్యూహాలు, ఫలితాలు ఇలా ఇవన్నీ స్టాక్ గమనంతో పాటు స్టాక్ మార్కెట్ గమనాన్ని కూడా నిర్దేశిస్తుంటా యి. అందుకే జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇంకా సరైన సమయంలో సరైన కంపెనీ స్టాక్‌ను నిపుణుల సలహాతో ఎంచుకోవా లి. ఇదే సమయంలో షార్ట్ టర్మ్‌లోనే లాభాలు రావాలని కూర్చోవద్దు. ఓపిక ఉండాలి. దీర్ఘ కాలంలోనే బంపర్ రిటర్న్లు వస్తుంటాయని నిపుణులు ఎప్పుడూ చెబుతుంటారు.అయితే గత కొంత కాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. గత వారం షేర్ మార్కెట్లో గణనీయమైన హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ముఖ్యంగా సెన్సెక్స్ టాప్-10 జాబితాలోని పలు కంపెనీల పెట్టుబడి దారులు నష్టాలను చవిచూశారు. మార్కెట్ విలువ పరంగా దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు టాటా గ్రూప్‌కు చెందిన టీసీఎస్, ఎల్ఐసీ వంటి సంస్థలకు గత వారం నిరాశజనకంగా ముగిసింది. అయితే ఈ పతనంలో రిలయన్స్ పెట్టుబడిదారులు అతిపెద్ద షాక్‌ను చవిచూశారు. కేవలం 5 పని దినాల్లో వారి సంపద రూ.లక్ష కోట్లకు పైగా తగ్గింది.వరుస సెషన్లలో పతనం దిశగానే సాగుతున్నాయి. ఇన్వెస్టర్లు తీవ్ర ఒత్తిడితో ఆయా షేర్లను విక్రయిస్తుండటం కారణంగా స్టాక్స్ పడిపోతుండటంతో పాటు వారు కూడా నష్టాల్ని ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, కార్పొరేట్ కంపెనీల బలహీనమైన త్రైమాసిక ఫలితాలకు తోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కఠిన నిర్ణయాలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.ఇక గత వారం కూడా సూచీలు భారీగానే పడిపోయాయి. బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 294.64 పాయింట్లు పడిపోయింది. ఈ క్రమంలోనే చాలా స్టాక్స్ పడిపోగా.. దేశంలో మార్కెట్ విలువ పరంగా టాప్-10 కంపెనీల్లో 6 కంపెనీల విలువనే ఏకంగా రూ. 2.22 లక్షల కోట్లు తగ్గడం గమనార్హం. ఇందులో దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్‌లో ఉంది. రిలయన్స్ సంస్థ ఎం- క్యాప్ 5 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 1.14 లక్షల కోట్లు తగ్గగా ఇప్పుడు అది రూ. 18.83 లక్షల కోట్లకు దిగొచ్చింది.ఆ తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉంది. ఇన్ఫీ మార్కెట్ విలువ గత వారం రూ. 29 వేల కోట్లకుపైగా తగ్గగా ప్రస్తుతం ఎం - క్యాప్ రూ. 6.29 లక్షల కోట్లుగా ఉంది. ఇదేసమయంలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. రూ. 23 వేల కోట్ల పతనంతో రూ. 5.60 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 20 వేల కోట్లు తగ్గి రూ. 11.34 లక్షల కోట్లకు పడిపోయింది. బజాజ్ ఫైనాన్స్ ఎం క్యాప్ రూ. 17 వేల కోట్లు తగ్గింది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 17వేల కోట్లు పడిపోయింది.వీటికి భిన్నంగా మరో 4 కంపెనీల విలువ అమాంతం పెరిగింది. ఫలితాల్లో ఈ కంపెనీలు అంచనాల్ని మించగా.. షేర్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీ ఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో నిలిచింది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 37 వేల కోట్లు పెరిగి రూ. 15.38 లక్షల కోట్లకు ఎగబాకింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎంక్యాప్ రూ. 35వేల కోట్లు పెరగడంతో రూ. 10.53 లక్షల కోట్లుగా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ. 20 వేల కోట్లు పెరిగి రూ. 11.04 లక్షల కోట్ల వద్ద ఉంది. అంతకుముందు వారం ఇది మార్కెట్ విలువలో టీసీఎస్‌ను మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ తగ్గింది. ఎస్బీఐ ఎం - క్యాప్ రూ. 9 వేల కోట్లు పెరిగి రూ. 7.44 లక్షల కోట్లకు చేరింది.స్టాక్ మార్కెట్ లో వచ్చిన పతనం కారణంగా బే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని 30 షేర్ల సెన్సెక్స్ 294.64 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ పరిణామంలో సెన్సెక్స్ టాప్-10లో 6 కంపెనీల మార్కెట్ క్యాప్ సంయుక్తంగా రూ.2.22 లక్షల కోట్ల భారీ పతనాన్ని చవిచూసింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. అయితే ఈ పతనంలో కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ సహా నాలుగు సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ పెరిగి పెట్టుబడిదారులకు ఊరటనిచ్చింది.గత కొన్ని వారాలుగా దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ తగ్గినప్పటికీ ఇది ఇప్పటికీ దేశంలో అత్యంత విలువైన కంపనీల జాబితాలోనంబర్ 1స్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దీని తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్,ఎస్బీఐ, ఇన్ఫోసిస్,బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ ఉన్నాయి. మార్కెట్ ఒడిదుడుకులు ఉన్నప్పటికీ రిలయన్స్ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

## సింహాద్రిలో నేత్రపర్వంగా గరుడ సేవ

**సింహాచలం, తెలంగాణ దిశ :** నమో నరసింహ దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం గా విరాజిల్లుతున్న సింహాచలం దేవస్థానంలో గరుడ సేవ నేత్రప ర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని మండపంలో అధిష్ఠింపజేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమ శాస్త్రం విధానం లో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# సినిమా..

## డ్రాగన్ బ్యూటీ.. అగ్గిరాజేసే అందం..!



ఒక్క సినిమా హిట్టు పడితే చాలు సినీ పరిశ్రమలో తమ ఫేట్ మారిపోతుంది. అప్పటిదాకా సినిమాలు చేసినా కూడా ఒక్క హిట్ సినిమా వల్ల డజన్ల కొద్దీ ఛాన్స్ లు వస్తుంటాయి. ప్రస్తుతం ఇలాంటి ఫేజ్ లోనే ఉంది డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి ఇప్పటికే సినిమాలు చేస్తున్నా కూడా అమ్మడు అంతగా పాపులర్ అవ్వలేదు. తెలుగులో ఆల్రెడీ శ్రీవిష్ణుతో అల్లూరి సినిమా చేసింది కయదు లోహర్. ఆ టైంలో అమ్మడిని అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ ప్రదీప్ రంగనాథ్ డ్రాగన్ సినిమా రిలీజైన దగ్గర నుంచి కయదు కనిపిస్తే చాలు హడావిడి చేస్తున్నారు. కయదుకి వచ్చిన ఈ క్రేజ్ ఆమెకు వరుస అవకాశాలు వచ్చేలా చేస్తున్నాయి. డ్రాగన్ సినిమాలో కయదు గ్లామర్ షో కుర్రాళ్లని ఎట్రాక్ట్ చేసింది. కయదు తెలుగులో కూడా మంచి క్రేజ్ సంపాదించింది. ప్రస్తుతం అమ్మడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో నటిస్తుంది. రవితెజ అనార్కలిలో కూడా ఉందని టాక్. ఐతే ఎలాగు సినిమా ఆఫర్లతో సూపర్ జోష్ లో ఉన్న కయదు అది చాలదు అన్నట్టుగా తన సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా అదరగొట్టేస్తుంది. అమ్మడి ఫోటో షూట్స్ ఇలా షేర్ చేస్తే అలా వైరల్ అవుతున్నాయి. లేటెస్ట్ గా కయదు లోహర్ చంకీల డ్రెస్ లో తళతళ మెరుస్తుంది. ఈ ఫోటో షూట్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్గి రాజేస్తున్న అందం.. గుండెల్ని గుచ్చేసే చూపులతో కయదు హృదయాలను మెలిపెట్టెస్తుందని చెప్పొచ్చు. డ్రాగన్ ఒక్క హిట్ తోనే అమ్మడు ఈ రేంజ్ పాపులారిటీ సంపాధించగా ఇక నెక్స్ట్ అమ్మడి ఖాతాలో మరో హిట్ పడితే మాత్రం ఇక తిరుగు లేని క్రేజ్ తెచ్చుకునేలా ఉంది. తెలుగులో మాత్రం కయదుకి మంచి బజ్ ఏర్పడింది. విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో ఆమె స్పెషల్ ఎట్రాక్షన్ అవుతుందని చెప్పొచ్చు. అనుదీప్ డైరెక్షన్ లో వస్తున్న ఫంకీతో కయదు టాలీవుడ్ కి మరోసారి రీ ఎంట్రీ ఇస్తుంది. తనకు వచ్చిన ఈ క్రేజ్ ని ఎంజాయ్ చేస్తున్న కయదు రెగ్యులర్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎంటర్టైన్ చేస్తుంది. కయదు గ్లామర్ షోకి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. చూస్తుంటే అమ్మడు సౌత్ లో టాప్ రేంజ్ కి వెళ్లేలా ఉందని చెప్పొచ్చు.

## మరో కొత్త బిజినెస్‌లోకి సమంత



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రీసెంట్ గా సినిమాల విషయంలో చాలాతక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. సమంతపై వార్తలొస్తున్నప్పటికీ అవి ఆమె సినిమాలకు సంబంధించినవి కాకుండా తన పర్సనల్ విషయాల గురించే ఎక్కువగా వస్తున్నాయి. ఎన్నో ఛాలెంజింగ్ రోల్స్ తో పాటూ చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్లను చేస్తూ వచ్చిన సమంత ఇటీవల ఎలాంటి పెద్ద సినిమాల్లోనూ నటించింది లేదు. పెద్ద సినిమాల్లో నటించక పోవడమే కాకుండా ఎలాంటి పెద్ద ప్రాజెక్టునీ అనౌన్స్ కూడా చేయలేదు. దీంతో సమంత తర్వాతి ప్రాజెక్టు ఏంటా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం సమంత ఇప్పుడు మరో కొత్త వెంచర్ లోకి అడుగుపెడుతున్నట్టు తెలుస్తోంది.

ఇప్పటికే నటిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన సమంత ఇప్పుడు మరో కొత్త బిజినెస్ లోకి ఎంటరవుతున్నారని సమాచారం. అదే లగ్జరీ పెర్ఫ్యూమ్. కేవలం కొత్త పర్ఫ్యూమ్ ను స్టార్ట్ చేయడమే కాకుండా దాన్ని ప్రీ మియం లైఫ్ స్టైల్ బ్రాండ్ గా మార్చడానికి సమంత ప్రయత్నిస్తున్నా రని సమంత సన్నిహిత వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కాన్సెప్ట్ నుంచి బ్రాండింగ్ వరకు ప్రతీ దానిలోనూ సమంత ఇన్వాల్వ్ అవుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

ఫ్యాషన్ రంగంలో ఎప్పుడూ ముందుండే సమంత ఈ ఫ్యాషన్ ప్రాజెక్టును సక్సెస్‌ఫుల్ గా మార్చాలని డిసైడై అందుకు తగ్గ అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇది సక్సెస్ అయితే సమంత కెరీర్లోనే ఓ కొత్త అధ్యాయం సృష్టించినట్టు అవుతుంది. సినిమాల విషయానికొస్తే సమంత వరుస పెట్టి సినిమాలను ఓకే చేయకుండా స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గతేడాది మొత్తం మయోసైటిస్ వల్ల సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తన కంబ్యాక్ చాలా స్ట్రాంగ్ గా ఉండాలని దానికి తగ్గ కథలనే ఎంచుకుంటున్నారు. ఇప్పటివరకైతే సమంత ఎలాంటి ప్రాజెక్టుకీ సైన్ చేయలేదు కానీ రెండు ప్రాజెక్టులు చర్చల దశల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అందులో ఒక సినిమా తెలుగు కాగా మరోటి బాలీవుడ్ ప్రాజెక్టని, స్టార్ డైరెక్టర్లు ఈ సినిమాలకు దర్శకత్వం వహించనున్నారని అంటున్నారు. అయితే సమంత ఈ రెండు సినిమాలు ఫైనల్ అయ్యే లోపు తన పర్ఫ్యూమ్ బిజినెస్ తో అందరినీ ఎట్రాక్ట్ చేసేలా కనిపిస్తున్నారు.

## ప్రేమ, పెళ్లిపై శ్రీలీల స్పందన




టాలీవుడ్ లో అతి తక్కువ కాలంలో స్టార్ గా ఎదిగిన హీరోయిన్ శ్రీలీల. అద్భుతమైన నటన, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో భారీ ఫాలోయిం గ్ ను సొంతం చేసుకుంది. వరుస సినిమాలతో దూసుకుపోతోంది. బాలీవుడ్ లోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి అంశాలపై శ్రీలీల ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం తన వయసు 24 సంవత్సరాలు మాత్రమేనని... 30 ఏళ్లు వచ్చేంత వరకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని శ్రీలీల తెలిపింది. ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం సినిమాలపైనే ఉందని చెప్పింది. ప్రైవేట్ లైఫ్ గురించి ఆలోచించేందుకు తనకు సమయం లేదని తెలిపింది. తాను నిజంగా రిలేషన్ లో ఉంటే... అమ్మ తమతో ఉండగలదా అని ప్రశ్నించింది. అమెరికా వెళ్లినప్పుడు కూడా అమ్మ తనతోనే ఉ ంటుం దని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో తాను ఎవరితో ప్రేమలో పడగల నని ప్రశ్నించారు. ప్రస్తుతం తనకు పెద్ద సినిమాలు వస్తున్నాయని తెలిపింది. ప్రేక్షకుల అభిమానం పొందడమే తన లక్ష్యమని చెప్పింది.




## టీజర్‌ని కావాలనే టార్గెట్ చేశారు.

‘బింబిసార’ సినిమాతో సంచలన హిట్ కొట్టిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ఠ, ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవితో ‘విశ్వంభర’ అనే సోషియో–ఫాంటసీ సినిమాను డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం టీజర్ విడుదల కాగా, ఆ సమయంలో కొంత నెగిటివిటీ ఎదురైనా, ఇప్పుడు వశిష్ఠ తన మాటలతోనే కాకుండా, కంటెంట్‌తోనే గట్టి కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వశిష్ఠ మాట్లాడుతూ..“టీజర్ వచ్చినప్పు డు కొన్ని ట్రోల్స్ వచ్చాయి. కావాలనే నెగిటివ్ ప్రచారం చేశారు. కానీ ట్రైలర్ చూసాక వాళ్లకు నోట మాట రాకపోవచ్చు. సినిమా అయితే అంచనాలకు మించి ఉంటుంది అని స్పష్టం చేశారు. వశిష్ఠ సినిమా కథను కూడా బయటపెట్టాడు . భారతీయ పురాణాల ప్రకారం, పైన ఏడూ, కింద ఏడూ.. మొత్తం 14 లోకాలు ఉంటాయి. అయితే ఈ చిత్రం






15వ లోకం అయిన ‘విశ్వంభర’ చుట్టూ తిరుగుతుంది. ఆ లోకంలో ఉండే నాయిక కోసం హీరో చేసే ప్రయాణమే ప్రధాన కథాంశమని డైరెక్టర్ చెప్పుకొచ్చాడు. చిరంజీవిని ఇప్పటివరకు చూడని లుక్‌లో, మాయాజాలంతో కూడిన ప్రపంచంలో చూపించబోతున్న వశిష్ఠ, ప్రేక్షకులు ఊహించిన దానికన్నా ఎక్కువ మేజిక్ చేస్తానంటున్నాడు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, కీరవాణి సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర టీజర్ తర్వాత గ్రాఫిక్స్ విషయంలో వచ్చిన విమర్శలపై నిర్మాతలు సీరియస్ అయ్యారు. అందుకే హాలీవుడ్ టెక్నీషియన్లను రంగంలోకి దించారు.ఈ సినిమాలో 4,676 షాట్స్ ఉంటాయని వశిష్ఠ చెప్పాడు. గ్రాఫిక్స్ కోసం రూ.75 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. ఇది ఇండియన్ సినిమా చరిత్ర లోనే భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్ వర్క్ కలిగిన ప్రాజెక్ట్ అవుతుందని చెబుతున్నారు.ఇటీవల విడుదలైన ‘విశ్వంభర’ ఫస్ట్ సింగిల్ అభిమా నులను ఆకట్టుకుంటోంది. కీరవాణి మార్క్ మ్యూజిక్‌కి ప్రేక్షకుల నుంచిమంచి స్పందనవచ్చిoది.ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. గ్రాఫిక్స్ పనులు పూర్తికాగానే విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. మెగాస్టార్ అభిమానులు, సోషియో ఫాంటసీ జానర్ ప్రేమికులు ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215